




విజయవాడ ఉత్సవ్ ముగింపు సభలో సీఎం చంద్రబాబు, పక్కన ఎంపీ కేశినేని చిన్ని

ఇంద్రకీలాద్రిపై దసర శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో అట్టహాసంగా జరగగా, నగరంలో విజయవాడ ఉత్సవ్ పేరిట గురువారం నిర్వహించిన మెగా కార్నివాల్ ఆ ఉత్సవాలను మరింత దేదీప్యమానం చేసింది. సీఎం చంద్రబాబు ఆసక్తికర ప్రసంగం, 3 వేల మందికి పైగా కళాకారుల సందడి, రెండు గంటల పాటు బందరు రోడ్డులో రెండు కిలోమీటర్లు సాగిన ఈ కార్నివాల్ నగరవాసులను ఆకట్టుకుంది. గిన్నిస్ రికార్డు కూడా సొంతం చేసుకోవడంతో నిర్వాహకులు, విజయవాడ వాసులపై సీఎం ప్రశంసల వర్షం కురిపించారు.



వెల్‌డన్ విజయవాడ

విజయవాడ ఉత్సవ్ బాగా చేశారు

నిర్వాహకులకు సీఎం చంద్రబాబు అభినందనలు

- కృష్ణాజిల్లా, విజయవాడ నీరు, గాలి ప్రత్యేకం
- మహామహులు ఇక్కడి నుంచి వచ్చినవారే..
- జిల్లాకు నీటి కొరత లేకుండా చేస్తా..
- ఆద్యంతం హుషారుగా సాగిన సీఎం ప్రసంగం
- విజయదశమి రోజంతా నగరంలో పర్యటన
- ఎంజీ రోడ్డులో మెగా కార్నివాల్, మారథాన్ రన్
- రెండు గంటలు.. రెండు కిలోమీటర్లు సందడి
- ప్రత్యేక ఆకర్షణగా పీవీ సింధు, శర్వానంద్
- గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న కార్నివాల్
- అత్యధిక డప్పు కళాకారులు పాల్గొన్నందుకే..
- 3 వేల మంది కళాకారులతో అదరహో..





బందరురోడ్డులో మెగా కార్నివాల్ (ఇన్‌సెట్‌లో) యాంకర్ సుమ సందడి



బందరురోడ్డులో డప్పు కళాకారుల విన్యాసాలు



ప్రత్యేక ఆకర్షణగా కోయ నృత్యం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'థాంక్యూ విజయవాడ.. వెల్‌డన్.. బాగా చేశారు. 11 రోజులుగా జరిగిన విజయవాడ ఉత్సవ్ నాలో, మీలో ఫుల్‌జోష్‌ను నింపింది. మీ అందరితో పాటు నాకూ చాలా ఆనందంగా ఉంది.' అంటూ విజయవాడ ఉత్సవ్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. బందరురోడ్డులో గురువారం నిర్వహించిన మెగా కార్నివాల్‌ను సీఎం వీక్షించారు. విజయవాడ ఉత్సవ్ ముగింపు కార్యక్రమం గొల్లపూడిలో జరగ్గా అక్కడ సీఎం మిగతా 6లో..

ఇక కృష్ణాజిల్లాకు నీటి కొరత ఉండదు

'ఒపక్క దుర్గమ్మ ఆశీస్సులు, మరోపక్క కృష్ణమ్మ పరవళ్లు.. కనులపండువగా ఉంది. కృష్ణానది నుంచి నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. వాటిని ఎలా సద్వినియోగం చేయాలో చూస్తున్నాం. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020 నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేసేవాళ్లం. గత ప్రభుత్వంలో విధ్వంసం జరిగింది. మాకు విజయాన్ని కట్టబెట్టారు. ఇక కృష్ణాజిల్లాకు చరిత్రలో నీటికొరత ఉండదు, ఉండబోదు' అని సీఎం అన్నారు.



విజయవాడ ఉత్సవ్ మారథాన్ రన్‌లో హీరో శర్వానంద్



దుర్గాఘాట్‌లో హంసవాహనం (ఇన్‌సెట్‌లో) ఇంద్రకీలాద్రిపై పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

విజయవంతం

11 రోజులు.. 15 లక్షల మంది భక్తుల రాక

అధికారుల అంచనాలకు తగ్గట్టుగానే వచ్చిన భక్తులు

- మూలానక్షత్రం రోజు రికార్డుస్థాయిలో 1.94 లక్షల మంది
- విజయదశమి రోజున 1.85 లక్షల మంది
- ఇంకా కొనసాగుతున్న భవానీల రద్దీ
- దుర్గాఘాట్‌లో ఆది దంపతుల తెప్పోత్సవం
- వరద కారణంగా హంస వాహనంలో పూజలతో సరి

పూర్ణాహుతితో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



తెప్పోత్సవానికి ఆది దంపతుల ఉత్సవమూర్తులను పల్లకీపై మోసుకెళ్తున్న సీపీ రాజశేఖరబాబు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అధికారుల అంచనాలు నిజమయ్యాయి. అందుకు తగ్గట్టుగా రూపొందించుకున్న ప్రణాళికలు సత్ఫలితాలను ఇచ్చాయి. వెరసి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలను 'విజయ'వంతంగా ముగించారు. ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి మిగతా 6లో..

ఓవైపు భక్తజనం.. మరోవైపు భవానీ నామస్మరణం.. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసినా ఇంద్రకీలాద్రికి ఇంకా భక్తులు భారీగా తరలి వస్తూనే ఉన్నారు. భవానీల రాకతో కొండంతా అరుణ వర్ణాన్ని పులుముకుంది. ఇక అంచనాలకు తగ్గట్టుగానే శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతమయ్యాయి. 11 రోజులు దాదాపు 15 లక్షల మంది భక్తులు దుర్గమ్మ దర్శనానికి తరలిరావడం విశేషం. వరద కారణంగా విజయ దశమి రోజు జరగాల్సిన తెప్పోత్సవం రద్దు అయినప్పటికీ.. హంస వాహనంపై గంగా సమేత దుర్గామల్లేశ్వరులకు పూజలు నిర్వహించారు. అంతకుముందు జరిగిన పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.



కృష్ణవేణి ఘాట్ వద్ద దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భవానీలు

ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

ఉత్సవాలు ముగిసినా తగ్గని రద్దీ

ఉత్తరాంధ్ర నుంచి భారీగా వస్తున్న భవానీలు

6



హెలీరైడ్ పొడిగింపు

రేపటి వరకు అందుబాటులో..

విజయవాడ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఉత్సవ్ పేరిట నిర్వహిస్తున్న హెలీ జాయ్ రైడ్స్‌కు నగర ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఇందిరాగాంధీ స్టేడియంలో విహంగ్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రైడ్‌కు స్పందన బాగా ఉండటంతో ఈనెల 5వ తేదీ వరకు పొడిగించారు. నిర్వాహకుడు కెప్టెన్ సూర్య శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హెలి టూరిజంను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఉన్నారని, అందుకు అనుగుణంగానే దసరా ఉత్సవాల సందర్భంగా ఈ హెలీ రైడ్స్‌ను ప్రారంభించామన్నారు. ప్రజల ఆదరణను దృష్టిలో ఉంచుకుని, కలెక్టర్ అనుమతులతో ఈ కార్యక్రమాన్ని ఈనెల 5వ తేదీ ఆదివారం వరకూ కొనసాగిస్తున్నట్లు సూర్య తెలిపారు.

ధాన్యం సేకరణలో

జాగ్రత్తలు తీసుకోండి

రవాణా, గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూడండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ. చిత్రంలో జేసీ నవీన్

- మద్దతు ధర తగ్గించే దళారులపై కేసులు నమోదు చేయండి
- ఈ-క్రాప్ నమోదును వెంటనే పూర్తిచేయండి
- అధికారుల సమావేశంలో కలెక్టర్ బాలాజీ ఆదేశాలు

మచిలీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనేందుకు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ హాల్లో శుక్రవారం జేసీ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టర్ 'ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల'పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ధాన్యం కొనుగోలులో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఈ ఏడాది అన్ని మిగతా 6లో..

సంచుల కొరత రానీయొద్దు

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతమైనపుడు సంచుల కొరత రానీయొద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వరికోతలు వేగవంతమై మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం వస్తే, ఇతర జిల్లాల్లోని మిల్లులకు పంపేలా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ధాన్యం పూర్తిస్థాయిలో తయారయ్యాకే వరికోతలు కోయాలనే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మిల్లుల నుంచి సీఎంఆర్ ద్వారా బియ్యాన్ని గోడౌన్లకు పంపే విషయంలోనూ క్రమపద్ధతిని పాటించాలన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, డీఎస్‌వో మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి, మార్కెటింగ్ విభాగం ఏడీ నిత్యానందం, డీసీవో చంద్రశేఖర్, జిల్లా రవాణాశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిన్నమనేని వీరయ్య చౌదరి, డీసీఎంఎస్ ప్రతినిధి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియాకు అధికారుల అండ

- నందిగామ మండలంలో యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- ఫిర్యాదు చేసిన రాఘవాపురం గ్రామస్తులు
- ఒక ఆటో పట్టుకుని, మరో ఆటోను వదిలేసిన అధికారులు
- కేసు కూడా నమోదు చేయకుండా తాత్సారం

నందిగామ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అక్రమ రేషన్ బియ్యం విషయంలో పీడీఎస్ అధికారులు పట్టువిడుపులతో పనిచేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారం కూడా తోడవడంతో రేషన్ మాఫియా పగలు రాత్రి తేడా లేకుండా దందా సాగిస్తోంది. ప్రజలెవరైనా ఫిర్యాదు చేస్తే తప్పని పరిస్థితుల్లో దాడులు చేస్తున్న పీడీఎస్ అధికారులు ఆనక పట్టుబడిన సరుకును వదిలేస్తున్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామం నుంచి అక్రమార్కులు తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోల సమాచారాన్ని ప్రజలు గురువారం పీడీఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డికి ఫోన్‌లో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదు రావడంతో రాఘవాపురం వెళ్లిన ఆయన రేషన్ బియ్యం లోడుతో ఉన్న రెండు ఆటోలను గుర్తించారు. రెండింటిలో ఒకటి వదిలేసి, మరొక దానినే పట్టుకున్నారు. పట్టుబడిన ఆటోను మిగతా 6లో..



వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను ముఖద్వారం

స్వచ్ఛంగా అవార్డులు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు కీలకమైన అవార్డుల ప్రకటన

విజయవాడ, ఆంధ్రజ్యోతి : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాకు రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ అవార్డులు దక్కాయి. ఈనెల 6న నగరంలో సీఎం చంద్రబాబు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు స్వచ్ఛ బస్‌స్టేషన్ అవార్డు లభించింది. అలాగే, దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర చెల్లించడంతో పాటు ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ పాడిరైతు సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి అండగా నిలబడి అత్యుత్తమ నాణ్యతతో వినియోగదారులకు సేవలందిస్తున్న కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి రాష్ట్రస్థాయిలో మిగతా 6లో..

- స్వచ్ఛత కార్యక్రమాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ స్వర్ణాంధ్ర-స్వచ్ఛత ఆంధ్రలో స్పెషల్ కేటగిరీ అవార్డు కైవసం చేసుకుంది. నగరపాలక సంస్థ పరిధిలోని పలు కార్యాలయాలతో పాటు అంగన్వాడీలు, రైతుబజార్లు, ఆసుపత్రులు కూడా ఈ అవార్డులు పొందాయి. ఎ.కొండూరు మండలంలోని మూడు కంపెనీలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు లభించాయి.

వెల్‌డన్ విజయవాడ

(5వ పేజీ తరువాయి)

హుషారుగా మాట్లాడారు. '11 రోజులుగా మీరు హుషారుగా ఉన్నారు' అని నవ్వుతూ అన్నారు. 'సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజలకు మానసిక ఆనందం కూడా అవసరం. విజయవాడ ఉత్సవ్ వంటి ఉత్సవాలే మానసికానందాన్ని ఇవ్వగలవు. సంప్రదాయాలను కాపాడుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధులు, దర్శకులు, నిర్మాతలతో పాటు ప్రముఖ నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్, ఘంటసాల వంటివారు విజయవాడ వారే. ఇక్కడి వారంతా దేశవిదేశాల్లో రాణిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి వన్నె తెచ్చేలా పనిచేశారు. నృత్యరీతులు, జానపదాలు, సంగీతం, పాటలు, సాహిత్యం, కళలు ఇవన్నీ మన సంప్రదాయం, సాంస్కృతికతలో భాగం. విజయవాడ ఉత్సవ్ లాంటి కార్యక్రమాల వల్ల మళ్లీ మన సంస్కృతీ సంప్రదాయాలు నిలబడతాయి' అంటూ సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ చేసిన కృషిని అభినందించారు. 'విజయవాడ వాసులకు చాలా తెలివితేటలున్నాయ్. ఇక్కడి నీరు, గాల్లో ఆ ప్రభావం ఎక్కువ ఉంటుంది. ఒక్కోసారి మీ తెలివితేటలను మీరు సద్వినియోగం చేసుకోవట్లేదు. అందుకే రానున్న రోజుల్లో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసు కుంటాం. విజయవాడ ఉత్సవ్‌తో బెస్ట్ పీపుల్ (ఏజెన్సీ)ను గుర్తించారు. వారందరికీ పనులు అప్పగించారు. అందువల్లే ఎక్కడా జరగని ఈవెంట్ 11 రోజులుగా 280 కార్యక్ర మాలతో జరిగింది. మీ అందరి కృషితో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ సాధిం చాం. వెయ్యిమందికి పైగా కళాకారుల ప్రదర్శనలతో ఆకట్టుకోవడమే కాకుండా జాతీయ సమగ్రతను కాపాడేలా ఈ కార్యక్రమాలు సాగాయి.' అని చంద్రబాబు పేర్కొన్నారు. గొల్లపూడి ఎగ్జిబిషన్ ఫుడ్ పెవిలియన్‌లో ఏఐ టెక్నాలజీ రొబోటిక్ కిచెన్ ఏర్పాటు చేయడం విజయవాడ పారిశ్రామికవేత్తల సామర్థ్యమని ఆయన ప్రశంసించారు.

విజయవంతం

(5వ పేజీ తరువాయి)

15,03,487 మంది భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. సెప్టెంబరు 22 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు గురువారం పూర్ణాహుతితో ముగిశాయి. సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి తొలిరోజు నుంచి లక్షల్లో భక్తులు వచ్చారు. విజయదశమి రోజున భవానీలు పోటెత్తారు. 1,85,230 మంది భక్తులు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. 22వ తేదీన 84,417 మంది, 23న 90,718 మంది, 24న 1,00,110 మంది, 25న 1,47,382 మంది, 26న 1,25,486 మంది, 27న 1,24,987 మంది, 28న 1,28,515 మంది ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. 29వ తేదీ మూలానక్షత్రం రోజున 1,94,070 మంది, 30న 1,39,573 మంది, ఈనెల 1వ తేదీన 1,25,329 మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చివరిరోజు గురువారం 1,85,230 మంది భక్తులు వచ్చారు. విజయదశమి ముగిశాక కూడా భవానీల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రానికి భవానీ భక్తులు లక్ష దాటారు. మొత్తంగా 16 లక్షల మంది అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ ఉత్సవాల్లో మొత్తం 20,512 మంది ప్రొటోకాల్ దర్శనాలు చేసుకున్నారు. 11,862 మంది రూ.300 టికెట్, 12,655 మంది రూ.100 టికెట్ దర్శనాలు చేసు కోగా, 14,58,458 మంది ఉచిత దర్శనం చేసుకున్నారు.

స్వచ్ఛంగా అవార్డులు

(5వ పేజీ తరువాయి)

స్వచ్ఛ ఇండస్ట్రీస్ పురస్కారం లభించింది. దీనిపై కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు స్పందిస్తూ ఆరుగాలం శ్రమించి పాల ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తున్న పాడిరైతుకే ఈ పురస్కారమన్నారు.

- మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్వచ్ఛ పాఠశాలగా, మోపిదేవికి చెందిన కర్లపూడి కోటేశ్వరరావు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. అలాగే, నాగాయలంక గ్రామ పంచాయతీకి జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కింది. కూచిపూడి రైతుబజార్‌కు, గుడ్లవల్లేరు మండలం అంగలూరు బాలికోన్నత పాఠశాలకు, ఉత్తమ్మ స్వచ్ఛ మునిసిపాలిటీగా తాడిగడప, బందరు మండలం పోతేపల్లి గ్రామ పంచాయతీని బెస్ట్ స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించింది.





ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై అరుణమయమైంది. కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భవానీ భక్తులు భారీగా వస్తున్నారు. విజయదశమికి మూడు రోజుల ముందు నుంచే ఈ రాక ఆరంభమైంది. అప్పటి నుంచి పెరుగుతూనే ఉంది. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి భవానీ భక్తులు ఎక్కువగా వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిసా, తమిళనాడు రాష్ట్రాల్లోని తెలుగువారు భవానీ మాలలు ధరించారు. మొత్తంగా 5-6 లక్షల మంది భవానీ మాలలు ధరించారు. వారంతా దీక్షల విరమణకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం వరకు 1.50 లక్షల భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. విజయదశమి రోజున శ్రీరాజరాజేశ్వరిదేవిగా కొలువుదీరిన అమ్మవారు అదే అలంకారంలో దర్శనమిస్తున్నారు. శనివారం నుంచి అమ్మవారు మామూలు అలంకారంలోనే దర్శనమిస్తారు. మరో మూడు రోజులపాటు ఒడిసా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భవానీలు వస్తారని అధికారులు అంచనా వేశారు. ఈ సారి భవానీల తాకిడి ఐదారు రోజుల పాటు కొనసాగుతుందని భావిస్తున్నారు.

ధాన్యం సేకరణలో జాగ్రత్తలు తీసుకోండి

(5వ పేజీ తరువాయి)

జాగ్రత్తలు తీసుకుని ధాన్యం కొనాలన్నారు. వాతావరణం సహకరించని రోజుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్లను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరికోతలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనే విధానంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. వివిధ ప్రాంతాల్లో వరికోతలు సాగుతున్న విధానంపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు స్పష్టమైన వివరాలు అందజేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలును పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేసి, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

మద్దతు ధర అమలుపై నిఘా ఉంచండి

ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులకు ఇస్తున్నారా, లేదా అనే అంశంపై నిఘా ఉంచాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. మద్దతు ధర కంటే తక్కువగా ధాన్యం కొనే దళారులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. వరికోతలు పూర్తిచేశాక ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ట్రక్‌షీట్లను తయారుచేశాక మిల్లుల వద్దకు వెళ్లాలని రైతులకు చెప్పాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనేందుకు ఈ-క్రాప్ కీలకమని, త్వరితగతిన ఈ-క్రాప్ నమోదును పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనే సమయంలో తేమశాతాన్ని నిర్ధారించడంలో మిల్లర్లు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జేసీ నవీన్‌కు కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని మిల్లుల్లో తేమశాతం కొలిచే యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిది పరిశీలించాలన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి ఇప్పటికే 200 వాహనాలను గుర్తించారని, మిగిలిన వాహనాలను గుర్తించి రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.





రేషన్ మాఫియాకు అధికారుల అండ

(5వ పేజీ తరువాయి)

స్టేషన్‌కు కానీ, ఆర్డీవో కార్యాలయానికి కానీ తీసుకురాకుండా మునగచర్లలోని ఒక మిల్లుకు తరలించినట్లు తెలిసింది. పట్టుబడిన ఆటోపై ఇంతవరకు కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం. ఆటో పట్టిబడినట్లు ధ్రువీకరించే కనీస రికార్డు కూడా వారి వద్ద లేదు. ఈ పరిణామంపై ఫిర్యాదు చేసిన రాఘవాపురం ప్రజలు విస్మయం చెందుతున్నారు. అక్రమార్కులకు పీడీఎస్ అధికారుల అండ ఉందంటున్నారు. ఒక ఆటోను వారే వదిలేశారని ఆరోపిస్తున్నారు. రెండో ఆటో కూడా వదిలేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివారం కేసు నమోదు చేస్తాం..


ఈ అంశంపై పీడీఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డిని వివరణ కోరగా, గురువారం తనకు రాఘవాపురం గ్రామస్తులు ఫోన్ చేశారని, తాను సంఘటనాస్థలికి వెళ్లేసరికి రెండు ఆటోలు కనిపించాయని, ఒక ఆటో ఆపకుండా వెళ్లిపోయినట్లు చెప్పారు. పండుగ రోజు కావడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేరన్నారు. పట్టుబడిన ఆటోపై కేసు ఎందుకు నమోదు చేయలేదని అడిగిన ప్రశ్నకు ఆయన సరైన సమాధానం చెప్పలేదు. ఆదివారం కేసు నమోదు చేస్తానని తెలిపారు.



రోశయ్య సేవలు మరవలేనివి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రిగా, గవర్నరుగా సేవలు అందించిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు ఆర్యవైశ్యులు మరవలేనివి అని ఆర్యవైశ్య మహాసభ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైడిసుధాకర్ అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పైడి సుధాకర్ ఆర్థిక సాయంతో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని గురువారం సుధాకర్ ఆర్యవైశ్య నేతలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాసవీమాత ఆలయ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి రామారావు, నాయకులు తవ్వా పూర్ణచంద్రరావు, తవ్వా కుటుంబరావు, కపిలవాయి భగవతి తదితరులు పాల్గొన్నారు.


రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సుధాకర్







రోగుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం

ప్రసాదంపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు ఎమెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 20 మంది రోగుల కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. బాపులపాడు మండలానికి చెందిన ఏడుగురికి రూ.6.80 లక్షలు, ఉంగుటూరు మండలానికి చెందిన ఇద్దరికీ రూ.95 వేలు, గన్నవరం మండలానికి చెందిన ఏడుగురికీ రూ.5.24 లక్షలు, విజయవాడ రూరల్ మండలానికి చెందిన నలుగురికి రూ. 1.36 లక్షలు కలిపి నియోజకవర్గంలో రూ.14.36 లక్షలు విలువ చేసే చెక్కులను రోగుల కుటుంబ సభ్యులకు అందించారు.


భవానీలతో నిండిన బొమ్ములూరు సేవా శిబిరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : బొమ్ములూరు వద్ద వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ నిర్వహిస్తున్న సేవా శిబిరం భవానీలతో నిండి పోయింది. కాలినడకన వచ్చే భవానీలకు అల్పాహారం, విశ్రాంతి సదుపాయం, అన్నప్రసాద వితరణ, వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో విజయవాడ వెళ్లే భవానీలకు తోడు అమ్మవారి దర్శనం పూర్తి చేసుకున్న భవానీలు కూడా శిబిరంలో అన్నప్రసాద వితరణ స్వీకరించారు. రెండు రోజుల్లోనే (గురువారం, శుక్రవారం) సుమారు 27వేల మందికి పైగా భవానీలు, భక్తులు అన్నప్రసాద వితరణ, వివిధ సేవలు స్వీకరించారు. గత 17సంవత్సరాల ఏగా భవానీలకు సేవలందిచడం అమ్మవారు తనకు కల్పించిన భాగ్యంగా వీహెచ్‌పీ జాతీయట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ తెలిపారు. పుట్టగుంట కుటుంబ సభ్యులతో పాటు కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాల్గొన్నారు.















గాంధీ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, వేదికపై కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నారాయణరావు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, బుద్ధప్రసాద్ తదితరులు

గాంధీ హిల్ అభివృద్ధికి సహకరిస్తాం

మహాత్మునికి పలువురి ఘన నివాళి

వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా గాంధీ హిల్ నిరాదరణకు గురైందని, దాని పూర్వ వైభవానికి తమ వంతు కృషి చేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటాని పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ మహాత్ముడు అహింసావాదాన్ని నమ్మడం వల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. విజయవాడకు ఘన చరిత్ర ఉందన్నారు. గాంధీ హిల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం డాక్టర్ శారద రచించిన తెలుగు నేలపై గాంధీజీ అడుగులు, పూర్ణచంద్రరావు రచించిన ఆంధ్ర గాంధీయం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాంధీ హిల్ పూర్వ అధ్యక్షుడు రాజు,మాజీ మేయర్ జంధ్యాల శంకర్, విశ్రాంత ఐఏఎస్ చక్రపాణి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నారాయణరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ కేపీసీ గాంధీ, కలెక్టర్ లక్ష్మీశ, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తదితరులు పాల్గొన్నారు

జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో...

విజయవాడలోని విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

శాంతియుత పోరాటానికి జాతిపిత మహాత్మాగాంధీ ఆద్యులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పాతబస్తీ గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కె.రామకృష్ణ మాట్లాడుతూ శాంతియుత పోరాటాల ద్వారా భారత స్వాతంత్ర ఉద్యమాన్ని ప్రపంచ వ్యాప్తంగా చర్చింప చేసిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. గాంధీ స్ఫూర్తిగా నేడు పోరాటాలు సాగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టిరాయప్ప, తాడి పైడియ్య, అప్పురబోతు రాము, సంగుల పేరయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

జీవో 7పై రాష్ట్ర కాపు జేఏసీ ఆనందం

గాంధీనగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దొమ్మరులను గిరి బలిజ గా మార్పు చేసి ప్రభుత్వం ఇచ్చిన జీవో 5పై స్టేటస్‌కో ఇచ్చి జీవో 7ను ఇవ్వడాన్ని రాష్ట్ర కాపు జేఏసీ స్వాగతించింది. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌కు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ గిరి బలిజ పేరుతో బలిజ, కాపు వర్గాలను అవమానించారన్నారు. దశాబ్దాలుగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జనాభా దమాషా ప్రకారం కాపులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, నామినేటెడ్ పదవులు కేటాయించాలన్నారు. కొక్కిరాల సంజీవ్ కుమార్, సమతం రాము, చందు భావనారాయణ, రాధా,రంగా మిత్రమండలి నేత ముళ్ళపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షణ తరహాలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు

ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి

కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల తరహాలో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2025ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. సీఎం చంద్రబాబు 6న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదానం చేస్తారని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ బి.అనిల్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు.



ఎంజీ రోడ్డులో అమ్మవారి రథం ఊరేగింపు

వీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పీవీ సింధు



కోయ నృత్యం

వావ్.. ఉత్సవ్

విజయవాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులో నిర్వహించిన మెగా కార్నివాల్ వావ్ అనిపించింది. విజయవాడ నగరం గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది. అత్యధిక డప్పు కళాకారులు పాల్గొన్నందుకు అవార్డు వరించింది. ఇటీవలే మట్టి గణపతి ప్రతిమల తయారీలో గిన్నిస్‌లోకి ఎక్కిన నగరం.. రెండు నెలల్లోనే విజయవాడ నగరం గిన్నిస్ రికార్డులో చోటు సంపాదించింది. అమ్మవారి రథం ఊరేగింపు, 250కు పైగా డప్పు వాయిద్యాల కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా, 42కు పైగా కళా ప్రదర్శనలతో రెండు కిలోమీటర్లు పొడవునా మూడు వేల మంది భారతీయ కళాకారుల ప్రదర్శన ఆహూతులను అలరించింది. సీఎం చంద్రబాబు, స్టార్ షట్లర్ పీవీ సింధు వీక్షించారు. కళా ప్రదర్శనలు ఇచ్చిన బృందాలను సీఎం ప్రత్యేకంగా అభివాదం చేశారు.

ఇంద్రకీలాద్రి అధికారులు ఏర్పాటు చేసిన దుర్గమ్మ వైభవ శకటం ముందుకు కదులుతుండగా అమ్మవారికి కళా నైవేద్యం సమర్పిస్తున్నట్లు వెనుకనే కళాకారులు కదిలారు. చెన్నుపాటి పెట్రోల్ బంక్ కూడలి నుంచి ఆర్టీఏ జంక్షన్ వరకు కళాకారులు ప్రదర్శనల ఇస్తూ బెంజిసర్కిల్ వరకు చేరుకున్నాయి. కొండ దొరలు, దసరా పగటి వేషగాళ్లు, శ్రీకాకుళంలో పుట్టిన తప్పెట గుళ్ల ప్రదర్శన విశేషంగా ఆకర్షించాయి. దుర్గాదేవి అలంకరణలను ఓ బృందం అద్భుతంగా ప్రదర్శించింది. మళయాల నృత్యం,

ఎన్టీఆర్ జిల్లాలలోని ఏ కొండూరు ప్రాంత గిరిజనులు బిందె మీద బిందె పెట్టి చేసే ప్రదర్శన ఆకట్టుకుంది. గిరిజన సాంప్రదాయ వస్త్రాలంకరణలో మహిళలు అలరించగా, పసుపు చీరలతో మహిళలు దింశా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కాటికాపరుల కళా రూపాలు ఆకట్టుకున్నాయి. చెక్క బజన ఆకట్టుకోగా, గరగరలు, వీరనాట్య పురాణ గాథ కళారూపం అద్భుతాన్ని ఆవిష్కరించాయి. తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలకు చెందిన కళానైపుణ్యాల ప్రదర్శన జరిగింది. ఎంజీ రోడ్డులోకి వాహనాలను అనుమతించలేదు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఏటా ఉత్సవ్‌ను నిర్వహిస్తాం : కేశినేని శివనాథ్

విజయవాడ ఉత్సవ్ భవిష్యత్తులో అమరావతికి మణిహారంగా ఉంటుంది. ప్రతి ఏడాది విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నాలుగు వేదికలపై కళాకారుల ప్రతిభను నగర వాసులు ఎంతగానో ఆదరించారు. మంత్రి నారా లోకేశ్‌తో ప్రారంభించిన ఉత్సవ్ విజయవంతంగా సాగింది. మైసూరు, కలకత్తా ఉత్సవాలను తలపించే విధంగా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించామన్నారు. 11 రోజుల పాటు 5 వేదికపైప 280 కార్యక్రమాలు జరిగాయన్నారు. అంతరించిపోతున్న జానపద కళారూపాలను ఉత్సవ్ ద్వారా ప్రజలకు చూపించామన్నారు.











భరతనాట్య ప్రదర్శన

సాంస్కృతికోత్సవం

విజయవాడ కల్చరల్ / ఇబ్రహీంపట్నం / గొల్లపూడి / విజయవాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఉత్సవ్‌లో సాంస్కృతికోత్సవం వెల్లివిరిసింది. ఉత్సవ్ ముగింపు రోజు (విజయదశమి) గురువారం ప్రధాన వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

కాకినాడ కరపకు చెందిన తోట దావీదు బృంద తోలుబొమ్మలాట ప్రదర్శించారు. విఘ్నేశ్వర కళాబృందం విన్యాసాలు కనువిందు చేశాయి. జ్యోతుల శ్రీరామచంద్రమూర్తి వారి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పక్కి మంజూష శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన రంజింప చేశాయి. భక్త ప్రహ్లాద పౌరాణిక నాటక ప్రదర్శన రక్తి కట్టించింది.

ఘంటసాల సంగీత కళాశాలలో..

శ్రీరాజేశ్వరి నాట్యమండలి బృందం ప్రదర్శించిన బాల నాగమ్మ జానపద పౌరాణిక పద్య నాటకం ఆహూతులను కట్టిపడేసింది. పాత్రలు మాయల ఫకీర్ పాత్రకు జెట్టి సాంబశివరావు, కార్యవర్ధి- ముత్యాల నాగేశ్వరరావు, బాలవర్ధి -పాపారావు, తలారి- ఈగ నాగేశ్వరావు, పులిరాజు- కంచర్ల చంటి, బాల నాగమ్మ - తిరుమలాబి, సంగు - అడపా ప్రభావతి అద్భుత నటనాభినయం చేశారు. కాకినాడకు చెందిన రాజేశ్వరి బుర్రకథ బృందం అల్లూరి సీతారామ రాజు కథను ప్రదర్శించారు. అనంత పురానికి చెందిన తరిమెల రాజు కళాబృందం జానపద పాటలు ప్రేక్షకులను అలరించాయి. సాయి భవ్య శ్రీకూచిపూడి నాట్య ప్రదర్శన అలరిం చింది. సప్పా శివ కుమార్ శిష్యురాలు వి.సాయి భవ్యశ్రీ కూచిపూడి నాట్యం అలరించింది.



పల్లవి

గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రముఖ కర్నాటక సంగీత గాయకులు సందీప్ నారా యణ్ లైవ్ మ్యూజిక్ సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. ఏపీ చంద్రబాబ ముఖ్య అతిథిగి పాల్గొన్నారు. కలకత్తా అమ్మ వారి బెంగాలీ సాంగ్ హరిగిరి నందిని పాటకు చేసిన నృత్య రూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న ఏవీ..

సీఎం చంద్రబాబు పై ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రదర్శించిన ఏవీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, విజయవాడ నగర ప్రజలతో ఎగ్జిబిషన్ మైదానం కిక్కిరిపోయింది. ఫుడ్ కోర్టుతో పాటు పలు రకాల ఆట వస్తువుల వద్ద, స్టాల్స్ వద్ద సందడి నెలకొంది. పున్నమి ఘాట్‌లో గురువారం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్యాచారిణి అనన్యరెడ్డి నృత్య ప్రదర్శన, గౌరీనాథ్ భక్తి సంకీర్తనలు ఆలపించి ఆధ్యాత్మిక భావాన్ని ఉప్పొంగించారు. గరికపాటి బృందం డప్పు కళా ప్రదర్శన ఇచ్చారు. పలు విన్యాసాలతో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యానికి గురిచేశారు. గాయకులు చరణ్, పల్లవి గీతాలు ఆలపించారు. కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి.



భక్తప్రహ్లాద నాటకం

స్వచ్ఛదాన్ - మారథాన్

● 13 రాష్ట్రాల నుంచి రన్నర్స్ ● 22, 10, 5 కేలుగా పరుగు

కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అమరావతి రన్నర్స్ సహకారంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛదాన్- మారథాన్'కు విశేష స్పందన లభించిందని స్వఛ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. గాంధీ జయంతి 'స్వచ్ఛ దివస్' 'స్వచ్ఛ తాహి సేవ'లో భాగంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మారథాన్‌కు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన ఇల్లు పరిశుభ్రంగా వుంచుకోవడంతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా వుంచుకోవాలనే ఉద్దేశ్యంతో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రా' ఉద్యమాన్ని సీఎం చంద్రబాబు ముందుండి నడిపిస్తున్నారన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా డేగా ప్రకటించి ప్రజల్లో స్వచ్ఛత పెంపొందించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం మారథాన్ కార్యక్రమం జరుగుతుందని పట్టాభిరామ్ తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సొసైటీఫర్ వైబ్రెంట్ విజయవాడ అధ్వర్యంలో 11 రోజులుగా 5 వేదికలపై జరుగుతున్న కార్యక్రమాలు భక్తులతో పాటు నగరవాసులు ఆస్వాదించారని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలకి నెలవుగా విజయవాడ మారిందన్నారు. విజయవాడ ఉత్సవ్ లాంటి వేడుకలు ప్రతి ఏటీ జరుగుతాయని గద్దె స్పష్టం చేశారు. సినీ నటుడు శర్వానంద్ మాట్లాడుతూ విజయవాడతో తనకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. ఇక్కడే పుట్టానన్నారు. ఇప్పుడు 12 కిలోమీటర్లు మాత్రమే పరుగెడుతున్నానని, వచ్చే దసరాకి స్వచ్ఛ మారథాన్‌లో 21 కేలో పాల్గొంటానన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే రామ్మోహన్, స్వచ్ఛ కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, సినీ నటుడు శర్వానంద్ మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. 21కే రన్ ఎలైట్‌మెన్ విభాగంలో గుజరాత్‌కు చెందిన 'ధర్మేంద్ర పుణ్య'కి పతకంతో పాటు రూ.లక్ష, రన్నర్‌గా పంజాబ్‌కి చెందిన 'లవ్ ప్రీత్ సింగ్'కు రూ.50వేలు, సెకండ్ రన్నరప్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన 'దినేష్'కు రూ.25 వేలు పట్టాభి, ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి అందజేశారు. 10కేలో విజేతలుగా నిలిచిన నవరతన్ చౌహాన్, పంకజ్‌కుమార్, అరవింద్ యాదవ్‌లకు నగదు బహుమతులు అందించారు.

మహిళా విభాగంలో 21కేలో వరుసగా హర్యానాకు చెందిన సోనికా, భారతిలకు, విజేతలుగా నిలిచిన వారికి కూడా పతకాలు వేసి సత్కరించారు. 10 కేలో వరుస మూడు స్థానాల్లో నిలిచిన సీతారాణి, ఆషికా పటేల్, డింపుల్‌సింగ్‌కు పతకాలతో పాటు నగదు బహుమతి అందించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు అనిల్ సుంకర, కేశినేని వెంకట్, బొండా సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



మారథాన్ ప్రారంభ సందర్భంగా మాట్లాడుతున్న కొమ్మారెడ్డి పట్టాభి, వేదికపై ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సినీ నటుడు శర్వానంద్ తదితరులు



మారథాన్‌లో పాల్గొన్న పలు రాష్ట్రాల క్రీడాకారులు

స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు..

మోపిదేవి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్వచ్ఛ పాఠశాలగా, మోపిదేవికి చెందిన కర్లపూడి కోటేశ్వరరావు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొద్ది సంవత్సరాలుగా ఆవరణను పరిశుభ్రంగా ఉంచటం, రసాయన రహిత పెరటి తోటల పెంపకం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలో వినియోగిస్తుండటం విశేషం. అవార్డుకు పాఠశాలను ఎంపిక చేయటంపై హెచ్‌ఎం జయంతి సంతోషం వ్యక్తంచేశారు.



స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా కోటేశ్వరరావు..

మోపిదేవి పంచాయతీలో పనిచేస్తున్న కర్లపూడి కోటేశ్వరరావు జిల్లా స్థాయిలో స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. 8 సంవత్సరాలుగా మోపిదేవి గ్రామం, పురవీధులు శుభ్రంగా ఉండేలా విశేష కృషి చేస్తున్నారు.

చల్లపల్లి : ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో స్వచ్ఛ పంచాయతీగా చల్లపల్లి గ్రామం అవార్డును సాధించింది. రాష్ట్రస్థాయిలో ఆరు గ్రామాలను ఎంపికచేయగా, అందులో చల్లపల్లి ఒకటి. రాష్ట్ర స్థాయి అవార్డుతోపాటు జిల్లాస్థాయిలో మరో నాలుగు అవార్డులకు ఎంపికయ్యింది. 6వ తేదీన విజయవాడలో సీఎం చంద్రబాబు అవార్డులను ప్రదానం చేయనున్నారు.



హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఇండస్ట్రీస్‌గా పురస్కారం లభించింది. వీరవల్లి వద్ద నిర్మించిన ప్రాజెక్ట్ కామధేను(పాల ఫ్యాక్టరీ) అనతి కాలంలోనే రూ.1200కోట్ల టర్నోవర్‌తో పాటు పాడిరైతులకు బోనస్ చెల్లింపులు, సంక్షేమాభివృద్ధికి కృషితో పాటు పలు పథకాల ద్వారా పాడిపరిశ్రమ అభివృద్ధికి చేయూతనిస్తోంది. కృష్ణాజిల్లా పాలఉత్పత్తిదారుల సహకార సంఘం తయారు చేస్తున్న పాల ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుతోపాటు హైజెనిక్ సాంకేతికతతో వినియోగిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛతకు మారుపేరుగా కృష్ణాజిల్లా పాలఉత్పత్తిదారుల సహకార సంఘం(కృష్ణా డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్) నిలుస్తుందన్నారు.



పాడిరైతులదే ఈ పురస్కారం : చలసాని ఆంజనేయులు, ఛైర్మన్

పాలఉత్పత్తిని పెంపునకు కృషి చేస్తున్న ప్రతి పాడిరైతుదే ఈ పురస్కారమని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనే యులు అన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం కష్టించే రైతులే తమ యజమానులు. వారి కృషి ఫలితమే రాష్ట్రస్థాయి పురస్కారమన్నారు. ఈ సందర్భంగా అందరికి కృతజతలు తెలిపారు.

స్వచ్ఛ మునిసిపాలిటీగా తాడిగడప

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ ఉత్తమ స్వచ్ఛ మునిసిపాలిటీ అవార్డు సొంతం చేసుకొంది. కమిషనర్ షేక్ నజీర్ ఆనందం వ్యక్తం చేశారు. పెనమలూరు ఎంపీడీవో కార్యాలయం అవార్డును సొంతం చేసుకోగా, ఉత్తమ స్వచ్ఛ ఆసుపత్రిగా యనమలకుదురు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటరు, ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా పెనమలూరు ఉన్నత పాఠశాల, స్వచ్ఛ వారియర్‌గా యనమలకుదురు నాల్గో సచివాలయంలో పని చేస్తున్న బత్తుల రమణ అవార్డు సాధించారు.

నాగాయలంక: నాగాయలంక గ్రామ పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు వచ్చిందని కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు. పాలకవర్గం ఆనందం వ్యక్తం చేసింది.

స్త్రీశక్తి రూ.360 కోట్లు తక్షణం చెల్లించాలి

రవాణా శాఖ మంత్రికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ వినతి

బస్టేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలిసి ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం కింద చెల్లించాల్సిన 360 రూ.కోట్ల వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు పలు ప్రధాన సమస్యలపై ఆయ నకు వినతి పత్రం అందజేశారు. సీఎం చంద్ర బాబు హామీ మేరకు జీవో ఇంకా రాలేదని, వాటి కోసం 6వేల మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. మరోవైపు 3 వేల కొత్త బస్సులు, సిబ్బంది నియా మకాలకు చర్యలు చేపట్టాలన్నారు. పదవీ విరమణ చేసిన వారికి ఆర్‌వీఎంఎస్ స్కీమ్ అమలు వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సానుకూ లంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య బృందం ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు గడువు పెంపు

అగ్రి డైరెక్టర్ ఢిల్లీరావు

అమరావతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు గడువును ఈ నెల 25 వరకు పెంచినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పుచేర్పులకు ఈ నెల30 వరకు అవకాశం ఉంటుందన్నారు. తుది జాబితాను ఈ నెల31న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈసారి ఈ-కేవైసీని నోటిఫైడ్ పంటలకు మాత్రమే పరిమితం చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, సామాజిక అడవులు, సాగు చేయని బీడు భూములను ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులు బదిలీ కావడం, కొత్త ప్రాంతాల్లో సిబ్బంది భూ సర్వే నంబర్లు గుర్తించలేకపోవడం, గత రెండు నెలలు వర్షాలు, యూరియా సరఫరాపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం వంటి కారణాలతో ఈ-పంట డిజిటల్ సర్వేలో పురోగతి సాధించలేకపోయారు. దీంతో రాష్ట్రంలోని 290లక్షల ల్యాండ్ పార్శిల్స్‌లో ఇప్పటివరకు 36 శాతంతో 88లక్షల ల్యాండ్ పార్శిల్స్‌లోనే ఈ-పంట నమోదు జరిగింది. కృష్ణా, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 50 శాతం కన్నా ఎక్కువగా ఈ-పంట నమోదు కాగా, కడప, చిత్తూరు, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల్లో 22శాతమే ఈ-పంట నమోదు జరిగిందని వ్యవసాయశాఖ డైరెక్టర్ తెలిపారు.

అభివృద్ధిపథంలో గన్న'వరం'

- ఫలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ కృషి
- రూ.1.50 కోట్లతో గన్నవరం సెంటర్ విస్తరణాభివృద్ధి
- గన్నవరం, విజయవాడ రూరల్, బాపులపాడు, ఉంగుటూరుల్లో భారీగా సీసీ రోడ్ల నిర్మాణం
- అశోక్ లేల్యాండ్ పునరుద్ధరణ.. మలి దశలో 120 ఎకరాల్లో విస్తరణ
- ఎనికేపాడులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

(ఆంధ్రజ్యోతి, గన్నవరం)

గన్నవరం నియోజకవర్గం రూపురేఖలు మారుతున్నాయి. భారీ మౌలికసదుపాయాల కల్పన దిశగా శరవేగంగా అడుగులు పడుతున్నాయి. పారిశ్రామికంగానూ వేగంగా అడుగులు పడుతున్నాయి. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. గన్నవరం పట్టణంలో భారీ ఎత్తున సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్ళే ఎన్‌హెచ్ - 16 ను అనుసంధానం చేసే గన్నవరం - నూజివీడు ప్రధాన రహదారి మార్గాన్ని పట్టణంలో గాంధీచౌక్ నుంచి పోలీసు స్టేషన్ వరకు రూ.1.50కోట్ల వ్యయంతో విస్తరణాభివృద్ధి చేపడుతున్నారు. ఒకప్పుడు అక్రమణలమయంగా ఉన్న ఈ రహదారి రూపురేఖలనే మార్చేస్తున్నారు. ఆక్రమణలను తొలగించి రోడ్డును 100 అడుగుల పైన విస్తరించారు. మధ్యలో సెంట్రల్ మీడియం ను తొలగించి కొత్తగా మరో సెంట్రల్ మీడియం ఏర్పాటు చేశారు. రెండు వైపులా సైడ్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. పాత విద్యుత్ స్తంభాలను తొలగించి పొడవాటి కొత్త విద్యుత్ స్థంబాలను



ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు, విగ్రహాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ ప్లాంట్‌ను పునరుద్ధరించటానికి విశేష కృషి చేశారు. మరో 120 ఎకరాలలో మల్లవల్లిని విస్తరించేందుకు కృషి చేశారు. అతి త్వరలో ఇది కూడా కార్యరూపంలోకి రాబోతోంది. గన్నవరంలో ఉన్న విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం బయట హైవేపై బ్యూటిఫికేషన్‌కు శ్రీకారం చుట్టారు. వీఐపీ కారిడార్ పై సెంట్రల్ మీడియం, రెండు వైపులా గ్రీనరీ , ల్యాండ్ స్కేపింగ్ డెవలప్‌మెంట్ కోసం ప్రతిపాదనలు చేయించారు. ఇటీవలే రూ. 7 కోట్ల వ్యయంతో టెండర్లు కూడా పిలవటం జరిగింది. ప్రస్తుతం వీటికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గం పరిధిలోని గన్నవరం, విజయవాడ రూరల్, బాపులపాడు, ఉంగుటూరు మండలాలలో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లకు శ్రీకారం చుట్టారు.

పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా పంచుమర్తి ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పోరంకి పద్మశాలి సేవాసంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా పంచుమర్తి ప్రసాద్ ఎంపికయ్యారు. పోరంకిలోని ఒక ప్రైవేటు పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 27మంది సభ్యులతో కూడిన పద్మశాలి సేవా సంఘాన్ని ఎన్నుకొన్నారు. సంఘానికి కార్యనిర్వాహక అధ్యక్షునిగా మసనం శ్రీనివాసరావు, సభ్యులుగా సంగెపు రంగారావు, దివి వీరభద్రరావు, స్వర్గం మురహరిరావు, పోలన వెంకటేశ్వరరావు తదితరులు ఎంపికయినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.



తోపుడు బళ్లు పంపిణీలో బోడె వెంకట్రామ్

పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి

పెనమలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పేదలను ఆదుకునేందుకు దాతలు ఉదారంగా ముందుకు రావాలని యువ నేత బోడె వెంకట్రామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో తోపుడు బళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడిగడప, పోరంకి గ్రామాలకు చెందిన మహమ్మద్ ఇఫ్రానుల్లా, మీరాంపల్లి పద్మజలకు తోపుడు బళ్లు అందజేశారు. వెంకట్రామ్ మాట్లాడుతూ, తెలుగు సమాజంలో పేదరికాన్ని నిర్మూలించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న పీ4 పథకాన్ని రూపొందించారని తెలిపారు. పేదరిక నిర్మూలన దాతల చేతిలో ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాసరావు, తుమ్మల రాంకుమార్, కొండా ప్రవీణ్, బోడె సురేంద్ర, తోటకూర వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

ఉయ్యూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్స వాల్లో చివరిరోజు విజయ దశమి పురస్కరించుకుని గురు వారం రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీజగదాంబ సమేత సోమే శ్వరస్వామి ఆలయంలో చివరి రోజు శమీపూజ నిర్వహించారు. వంశీ రాయల్ సిటీ ఆవ రణ లో జరిగిన ఉత్సవాల్లో రాజరాజేశ్వరీదేవికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. సుధీర్ టింబర్ డిపో అధినేత,వాకర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ గవర్నర్ నూకల సాంబశివరావు దంపతులు, వంశీ, పూజలో పాల్గొన్నారు. డాక్టర్ కస్తూరి, ఇన్నర్‌వీల్ క్లబ్ సూర్యకుమారి పూజలు చేశారు. కాటూరు, చినఓగిరాలలో కనకదుర్గమ్మ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ : దేవీ నవరాత్రులు ముంగింపు సందర్భంగా గురువారం గ్రామంలోని పలు ఆలయాల్లో విజయదశమి వేడుకలు ఘనంగా జరిపారు. స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరి దేవిని విజయలక్ష్మిగా ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతుల కైంకర్యంతో అలంకరించి పూజలు నిర్వహించారు..ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, బాపులపాడు శివాలయాల్లో అమ్మవారిని రాజ రాజేశ్వరిగా అలంకరించి కొలిచారు. అనంతరం ఆలయాల్లో శమీపూజ ఘనంగా నిర్వహించారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో విజయదశమిని పురస్కరించుకొని ఎస్సై వి.సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించారు. నూజివీడు రోడ్డులో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. రంగన్నగూడెంలో నిర్వహించిన గ్రామోత్సవంలో ఎస్ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, మణికృష్ణ దంపతులు అమ్మవారికి హారతి ఇచ్చి ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారిని ఉంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి వారపోసి, పసుపు, కుంకుమ, మంగళహారతులతో మహిళలు స్వాగతం పలికారు. మల్లవల్లిలో శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యనమదల వెంకయ్యారావు, అక్కినేని కృష్ణాజీ తదితరుల పర్యవేక్షణలో గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తపల్లి, మడిచర్ల, బిళ్లనపల్లి, ఉమామహేశ్వరపురం తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించిన దసరా మహోత్సవాలు గ్రామోత్సవాలతో ముగిసాయి.

రైస్ మిల్లుల తనిఖీ

ఉయ్యూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరులో రైస్‌మిల్లులను తహసీల్దార్ సురేశ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. నవంబరు నుంచి ధాన్యం సేకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైస్‌మిల్లుల్లో ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. ధాన్యం తేమశాతంకు సంబంధించి మిల్లుల్లో ఏయే మిల్లుల్లో డ్రైయర్‌లు ఉన్నాయి. గోనెసంచుల లభ్యత తదితర అంశాలపై మిల్లర్లను అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల స్వచ్ఛత హీ సేవ

ఉయ్యూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గాంధీ జయంతి పురస్కరించుకుని ఉయ్యూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం 16 (ఎ)బీఎన్‌ఎన్ సీసీ క్యాడెట్లు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ ఆవరణ, పరిసరాలు శుభ్రపరచి, మొక్కలు నాటారు. శ్రీ విశ్వశాంతి స్కూల్ ఆవరణలో ఎన్‌సీసీ శిక్షణ ప్రదేశం నుండి హెల్త్ సెంటర్‌కు ప్రదర్శనగా చేరుకుని స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటి సంరక్షించి వాతావరణ సమతుల్యతపై అవగాహన కల్పిస్తూ అంకితభావాన్ని ప్రదర్శించారు.


హంస వాహనంలో పూజలందుకుంటున్న గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి


పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో జలవిహారం చేస్తున్న దుర్గమ్మ

నేత్రపర్వంగా హంస వాహనోత్సవం

● వైభవంగా దుర్గా మల్లేశ్వరస్వామి నగరోత్సవం

● మహా పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో 11రోజుల పాటు జరిగిన దసరా మహోత్సవాలకు ముగింపుగా గురువారం విజయ దశమి నాడు దుర్గామల్లేశ్వరులు హంస వాహనంలో విశేష పూజలం దుకున్నారు. హంస వాహన సేవ కన్నుల పండువగా జరిగింది. కృష్ణానదికి వరదలు రావటంతో తెప్పోత్సవం రద్దు కావడంతో గంగా పార్వతీమల్లేశ్వ రులను హంస వాహనంలో ఉంచి పూజలు చేశారు. ఈవో శీనానాయక్ దంపతులు కృష్ణవేణి మాతకు పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, గాజులు, చీర సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి పంచ హారతులు ఇచ్చారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకుడు రంగావఝుల శ్రీనివాస శాస్త్రి బృందం అర్చనలు చేశారు. వేదనాద మంత్రోచ్చరణ మధ్య ఓం కార హారతి, నాగహారతి, నక్షత్ర హారతి, కుంభహారతి, సింహ హారతి సమర్పించారు. ఈ హారతులను దర్శించుకున్న వారికి విశేష ఫలితాలు కలుగుతాయని విశ్వాసం.

వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా మహోత్సవాల చివరి రోజైన గురువారం గంగా పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను పోలీసులు పల్లకీలో ఊరే గింపుగా కృష్ణానది వరకు తీసుకువచ్చారు. దుష్ట రాక్షసుల ను సంహరించినందుకు సంకే తంగా ఆమెకు జ యజయ ధ్వానాలు వినిపించారు. తెప్పోత్సవం జరగకపోవటంతో లాంఛన ప్రాయంగా ఉత్సవమూర్తులను హంస వాహ నంపై అక్కడ ఉంచి పూజాదికాలు నిర్వహించిన అనం తరం పోలీసులే ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పారు వేట ఉత్సవానికి, అక్కడ నుంచి వన్‌టౌన్ పోలీ సు స్టేష న్‌కు తీసుకువెళ్లి తిరిగి తెల్లవారు జామున ఆలయానికి చేర్చారు. యాగశాలలో గురువారం మహా పూర్ణాహుతి నిర్వహించడంతో దసరా మహోత్సవాలు ముగిశాయి. పూర్ణాహుతి కార్యక్రమంలో దేవదాయ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమో హన్, ఈవో వి.కె.శీనానాయక్, తదితరులు పాల్గొన్నారు. పూజాదికాలకు ముగింపుగా కలశోద్వాసన చేశారు. కలశం లోని జలాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి దుర్గమ్మవారికి, మల్లేశ్వరస్వామికి, ఉపాలయాల్లోనూ భక్తుల పైన వాటిని ప్రోక్షించారు. దీంతో ఉత్సవాలకు ముగింపు పలికారు.అనంతరం పండిత సత్కారం జరిగింది. అర్చకులకు సంభావనలు అందజేశారు.

పాతరాజరాజేశ్వరిపేట : చివరి రోజైన పండుగ నాడు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకు న్నారు. భవానీలు అధికసంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భవానీల రాకతో క్యూలైన్లు, ఘాట్‌లు కిక్కిరిశాయి. భవానీలు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.


మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న నందమూరి మోహన్ కృష్ణ, మోహన రూప

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ఇంద్రకీలాద్రి : విజయదశమి నాడు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మను పలు వురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనా నంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దసరా ఉత్సవాల ప్రత్యేక అధికారి డి. భ్రమ రాంబ, ఈవో వి.కె.శీనానాయక్ వారికి అమ్మవారి చిత్ర పటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అమ్మవా రిని దర్శించుకున్నవారిలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ బి.కృష్ణమోహన్, డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి మండవ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహన్ కృష్ణ, మనవరాలు మోహనరూప, సినీ హీరో శర్వానంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు దంపతులు, కుటుంబ సభ్యులు యాంకర్ ఓంకార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో ఉన్నారు.

మీడియా పాయింట్‌లో మోహన కృష్ణ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలను ప్రసాదించా లని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ మన వరాలు నందమూరి మోహనరూప మాట్లాడుతూ అమ్మ వారు ప్రజలందరి ఆశలు, కోరికలు నెరవేర్చాలన్నారు. భవానీదీక్షాదారులకు, లక్షలాది మంది భక్తులకు ప్రభుత్వం మంచి ఏర్పాట్లు చేసిందని ప్రశంసించారు.

పవిత్ర సంగమంలో తెప్పోత్సవం

విజయవాడ కల్చరల్ /ఇబ్రహీంపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్ర సంగమం వద్ద తెప్పోత్సవం వైభవంగా జరిగింది. హంస వాహనంపై అమ్మవారు జల విహారం చేస్తుండగా భక్తజనం వీక్షించి తరించారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించామన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



అన్నప్రసాదం ఏర్పాట్లు భేష్

సత్యనారాయణపురం : భక్తులకు కనకదుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కేంద్రంలో ఏర్పాట్లు అద్భు తంగా ఉన్నాయి. సేవకులు భక్తులకు సూచనలు ఇస్తూ అన్నప్రసాదం తీసుకున్నతర్వాత వారిని ఎప్పటికప్పుడు బయటకు పంపుతూ కేంద్రంలో రద్దీని నివారించారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల నుంచి సిబ్బంది ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? అన్నప్ర సాదం ఎలా ఉందో తెలుసుకున్నారు. విరాళాలిచ్చే భక్తుల కోసం అక్కడే కౌంటర్లు ఏర్పాటు చేశారు.

గత ఏడాది ఉత్సవాల్లో కంటే తగ్గిన ఆదాయం

ఇంద్రకీలాద్రి : గత ఏడాది కంటే దసర ఉత్సవాల ఆదాయం గణనీయంగా తగ్గింది. సుమారు 13 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఆదాయం మాత్రం గత ఏడాది కంటే సుమారు కోటి రూపాయల వరకు తగ్గింది. గత ఏడాది రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.1,90,13,500 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అధికారులు రూ.500 టిక్కెట్‌ను రద్దు చేశారు. గత ఏడాది రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.50,54,400 ఆదాయం రాగా, ఈ ఏడాది ఉత్సవాల్లో రూ.35,20,800, రూ.100 టిక్కెట్‌ల ద్వారా గత ఏడాది రూ.38,38,400 ఆదాయం లభించగా, ఈ ఏడాది రూ.12,65,700 ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం రూ.15 టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.46,47,420 లభించగా, ఈ ఏడాది రూ.38,38,656 వచ్చింది. రూ.100 లడ్డూల ద్వారా గత ఏడాది రూ.2,98,64,500 రాగా, ఈ ఏడాది రూ.4,38,73,400 వచ్చింది. ప్రత్యేక కుంకుమార్చన రూ.3 వేల టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.6,06,000 రాగా, ఈ ఏడాది రూ.5,04,000, ప్రత్యేక కుంకుమార్చన రూ.5వేల టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.1,10,000 రాగా, ఈ ఏడాది రూ.1,75,000లు లభించింది. ప్రత్యేక చండీ హోమం టిక్కెట్ రూ.4వేల ద్వారా గత ఏడాది రూ.3,32,000 రాగా, ఈ ఏడాది రూ.1,48,000, ప్రత్యేక శ్రీచక్రనవావరణార్చన రూ.3 వేల టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.66,000 రాగా, ఈ ఏడాది రూ.24,000 వచ్చింది. ప్రత్యేక ఖడ్గమాలార్చన రూ.5 వేల టిక్కెట్ ద్వారా గత ఏడాది రూ.92,088 రాగా, ఈ ఏడాది రూ.3,32,550 లభించింది. పబ్లికేషన్, ఫొటోలు, క్యాలెండర్ల ద్వారా గత ఏడాది రూ.61,082 రాగా, ఈ ఏడాది రూ.1,26,565, కేశఖండనశాల రూ.40 టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.24,93,160 రాగా, ఈ ఏడాది రూ.25, 73,680, ఇతరత్రా ఆదాయం గత ఏడాది రూ.40,720 రాగా, ఈ ఏడాది రూ.1,10,310 లభించింది. గత ఏడాది తొమ్మిది రోజుల ఉత్సవాలలో రూ.6,62,19,270 ఆదాయం లభించగా, ఈ ఏడాది 11 రోజుల పాటు జరిగిన ఉత్సవాలలో రూ .5,64,92,651 ఆదాయం వచ్చింది. అధికారులు రూ.500 టిక్కెట్లు రద్దు చేయటంతో పాటు వీఐపీలు, వీవీఐపీలకు ఉచితంగా పాస్‌లు ఇవ్వటం వల్ల గత ఏడాది కంటే ఈ ఏడాది ఉత్సవాలలో సుమారు కోటి రూపాయల ఆదాయం తగ్గిందని సమాచారం.

సీఎం చంద్రబాబు అభినందనలు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో 11రోజుల పాటు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఎక్స్‌లో ఒక సందేశాన్ని పంపుతూ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రభుత్వ అధికారులు, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం చక్కగా నిర్వ హించిందని కొనియాడారు. 13 లక్షల మందికి పైగా భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకోవటానికి తరలివచ్చా రని, వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం భక్తుల మన్ననలు పొందిందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలలో పండు గలు ఒక భాగమన్నారు. పండుగల వేళ దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలకు రాష్ట్రానికి మంచి జరగాలని దుర్గమ్మను వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆరు లడ్డూల బాక్స్‌ల కొనుగోలుకు ఆసక్తి

ఇంద్రకీలాద్రి : దసరా ఉత్సవాలలో లడ్డూ ప్రసాదం అమ్మకాలు భారీగా జరిగాయి. లడ్డూ ఒక్కటి రూ.15లు, ఆరు లడ్డు బాక్స్ రూ.100లు. భక్తులు, భవానీలు ఆరు లడ్డూల బాక్స్ (రూ.100)ల కొనుగోలుకు ఆసక్తి చూపారు. దేవస్థానం అధికారులు 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసి సుమారు 30 లక్షల లడ్డూ ల విక్రయాలు జరుగుతాయని ఈవో వి.కె.శీనానాయక్ ఆదేశాల మేరకు ఏఈఓ వాసు పర్యవేక్షణలో ప్రతిరోజూ సుమారు 600 మంది సిబ్బంది మూడు షిఫ్టులలో లడ్డూ ప్రసాదం తయారీ చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచారు. ఉత్సవాలలో మొదటి రోజు 74,244ల లడ్డూ ప్రసాదం, రెండవ రోజు 94,025, మూడో రోజు 1,17,725, నాల్గో రోజు 1,56,302, ఐదో రోజు 2,18,028 లడ్డూలు భక్తులు కొనుగోలు చేశారు. ఆరో రోజు 2,16,521, ఏడో రోజు 3,19,250, ఎనిమిదో రోజు 2,76,537, తొమ్మిదవ రోజు 3,17,766, పదో రోజు 5,28,803, 11వ రోజు 6,53,853 లడ్డూలను భక్తులు, భవానీలు భారీగా కొనుగోలు చేశారు. మొత్తంగా దసరా ఉత్సవాల 11రోజుల్లో 29,73,054 లడ్డూ అమ్మకాలు జరిగాయి. శుక్రవారం రాత్రి 12 గంటల వరకు సుమారు 4 లక్షల లడ్డూ ప్రసాదం అమ్మకాలు జరిగే అవకాశం ఉందని ఏఈవో వాసు తెలిపారు. గత ఏడాది ఉత్సవాలు పూర్తి అయినమూడు రోజుల వరకు 28,09,007 లడ్డూ విక్రయాలు జరిగాయని, ప్రస్తుతం భవా నీ భక్తుల తాకిడి ఉండటం వల్ల మూడు లక్షల లడ్డూలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.


జస్టిస్ బి.కృష్ణమోహన్, డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ కిరణ్మయికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు


మంత్రులు రామనారాయణరెడ్డి, సారథి, ఎంపీ కేశినేని చిన్ని, నటుడు శర్వానంద్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ, సుజనాచౌదరి, సీపీ రాజశేఖరబాబు, క్రీడాకారిణి పి.వి.సింధు

వెల్‌డన్ విజయవాడ

(5వ పేజీ తరువాయి)

హుషారుగా మాట్లాడారు. '11 రోజులుగా మీరు హుషారుగా ఉన్నారు' అని నవ్వుతూ అన్నారు. 'సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజలకు మానసిక ఆనందం కూడా అవసరం. విజయవాడ ఉత్సవ్ వంటి ఉత్సవాలే మానసికా నందాన్ని ఇవ్వగలవు. సంప్రదాయాలను కాపాడుకోవాలి. స్వాతంత్ర్య సమర యోధులు, దర్శకులు, నిర్మాతలతో పాటు ప్రముఖ నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్, అమరగాయకుడు ఘంటసాల వంటివారు విజయవాడ వారే. ఇక్కడి వారంతా దేశవిదేశాల్లో రాణిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి వన్నె తెచ్చేలా పనిచేశారు. నృత్యరీతులు, జానపదాలు, సంగీతం, పాటలు, సాహిత్యం, కళలు ఇవన్నీ మన సంప్రదాయం, సాంస్కృతికతలో భాగం. విజయవాడ ఉత్సవ్ లాంటి కార్యక్రమాల వల్ల మళ్లీ మన సంస్కృతీ సంప్రదాయాలు నిలబడ తాయి' అంటూ సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ చేసిన కృషిని అభినందించారు. 'విజయవాడ వాసులకు చాలా తెలివితేటలున్నాయ్. ఇక్కడి నీరు, గాల్లో ఆ ప్రభావం ఎక్కువ ఉంటుంది. ఒక్కోసారి మీ తెలివితేటలను మీరు సద్వినియోగం చేసుకోవట్లేదు. అందుకే రానున్న రోజుల్లో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. విజయవాడ ఉత్సవ్‌తో బెస్ట్ పీపుల్ (ఏజెన్సీ)ను గుర్తించారు. వారందరికీ పనులు అప్పగించారు. అందువల్లే ఎక్కడా జరగని ఈవెంట్ 11 రోజులుగా 280 కార్యక్రమాలతో జరిగింది. మీ అందరి కృషితో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ సాధించాం. వెయ్యిమందికి పైగా కళాకారుల ప్రదర్శనలతో ఆకట్టుకోవడమే కాకుండా భిన్నత్వంతో ఏకత్వాన్ని చాటిచెప్పి జాతీయ సమగ్రతను కాపాడేలా ఈ కార్యక్రమాలు సాగాయి.' అని చంద్రబాబు పేర్కొన్నారు. గొల్లపూడి ఎగ్జిబిషన్ ఫుడ్ పెవిలియన్‌లో ఏఐ టెక్నాలజీ రొబోటిక్ కిచెన్ ఏర్పాటు చేయడం విజయవాడ పారిశ్రామికవేత్తల సామర్థ్యమని ఆయన ప్రశంసించారు.

విజయవంతం

(5వ పేజీ తరువాయి)

15,03,487 మంది భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. సెప్టెంబరు 22 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు గురువారం పూర్ణాహుతితో ముగిశాయి. సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి తొలిరోజు నుంచి లక్షల్లో భక్తులు వచ్చారు. విజయదశమి రోజున భవానీలు పోటెత్తారు. 1,85,230 మంది భక్తులు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. 22వ తేదీన 84,417 మంది, 23న 90,718 మంది, 24న 1,00,110 మంది, 25న 1,47,382 మంది, 26న 1,25,486 మంది, 27న 1,24,987 మంది, 28న 1,28,515 మంది ఇం ద్రకీ లాద్రికి తరలివచ్చారు. 29వ తేదీ మూలానక్షత్రం రోజున 1,94,070 మంది, 30న 1,39,573 మంది, ఈనెల 1వ తేదీన 1,25,329 మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చివరిరోజు గురువారం 1,85,230 మంది భక్తులు వచ్చారు. విజయదశమి ముగిశాక కూడా భవానీల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రానికి భవానీ భక్తులు లక్ష దాటారు. మొత్తంగా 16 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. మొత్తం 20,512 మంది ప్రొటోకాల్ దర్శనాలు చేసుకున్నారు. 11,862 మంది రూ.300 టికెట్, 12,655 మంది రూ.100 టికెట్ దర్శనాలు చేసుకోగా, 14,58,458 మంది ఉచిత దర్శనం చేసుకున్నారు.

స్వచ్ఛంగా అవార్డులు

(5వ పేజీ తరువాయి)

స్వచ్ఛ ఇండస్ట్రీస్ పురస్కారం లభించింది. దీనిపై కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు స్పందిస్తూ ఆరుగాలం శ్రమించి పాల ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తున్న పాడిరైతుకే ఈ పురస్కారమన్నారు.

- మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్వచ్ఛ పాఠశాలగా, మోపిదేవికి చెందిన కర్లపూడి కోటేశ్వరరావు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. అలాగే, నాగాయలంక గ్రామ పంచాయతీకి జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కింది. కూచిపూడి రైతుబజార్‌కు, గుడ్లవల్లేరు మండలం అంగలూరు బాలికోన్నత పాఠశాలకు, ఉత్తమ్మ స్వచ్ఛ మునిసిపాలిటీగా తాడిగడప, బందరు మండలం పోతేపల్లి గ్రామ పంచాయతీని బెస్ట్ స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించింది.

పాడి రైతుకు ప్రోత్సాహం భేష్

కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసానికి సీఎం చంద్రబాబు అభినందన


రైతులకు తామందిస్తున్న ప్రోత్సాహకాలు సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని, కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం

చిట్టినగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినం దించారు. గోకులాల ఏర్పాటు చర్యలను కొనియాడారు. పశువుల హాస్టల్స్ నిర్వహణకు ప్రభుత్వం తరపున సహ కారాలు అందిస్తామని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో అగ్రిక ల్చర్ పెవిలియన్‌ను చంద్రబాబు సందర్శించారు కృష్ణా మిల్క్ యూనియన్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ముఖ్యమంత్రి సీఎం ఆలోచన మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ము నగచర్లలో ఏర్పాటు చేసిన చంద్రన్న సామూహిక గోకులం నిర్వ హణ, అను బంధంగా సాగు చేస్తున్న పశుగ్రాస క్షేత్రాలు గురించి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా రూ.150 కి అందిస్తున్న సెక్స్ సార్టెడ్ సెమెన్ (లింగ నిర్ధారిత వీర్యం)ను కృష్ణా మిల్క్ యూనియన్ రూ.100 సబ్సిడీతో ఉమ్మడి కృష్ణాజిల్లా, ఉభయ గోదావరి జిల్లాలల పాడి రైతుల పాడి పశువులకు కేవలం రూ.50కి అందిస్తున్నా మని తెలిపారు. పశువుల హాస్టల్స్‌ను మరిన్ని ఏర్పాటు చేసి పాడి రైతుల నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గించి, పాడి రైతులు ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విజ యవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌ మ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తదిత రులు పాల్గొన్నారు.

రుణ అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి : సీఎం

ఇబ్రహీంపట్నం : పీఎం సూర్యఘర్, డ్రోన్లకు సంబంధించిన రుణ అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ చూ పాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు మరింత రుణ సదుపాయాలు కల్పించాలని కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు సూచించారు. విజయవాడ ఎక్స్‌పోలో కేడీసీసీ బ్యాంక్ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను చంద్రబాబు గురువారం సందర్శించారు. స్టాల్ ఏర్పాటు చేసి రైతుల సంక్షేమానికి సేవలందించడం అభినందనీయమని ఆయన అన్నారు. కేడీసీసీబీ నుంచి రైతులకు అందిస్తున్న సేవలను రఘురాం సీఎంకు వివరించారు. ఎనిమిది వేల స్వయం సహాయంక సంఘాలకు రుణాలు మంజూరు చేశామని బ్యాంక్ సీఈవో శ్యామ్ మనోహర్ వివరించారు. సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దేశించిన అభి వృద్ధి లక్ష్యాలకు మద్దతుగా నిలవడం దేశంలోనే మొదటి రెండు మూడు స్థానాల్లో కేడీసీసీ బ్యాంక్ ఉండటం స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ఇంద్రకీలాద్రిపై అరుణమయమైంది. కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భవానీ భక్తులు భారీగా వస్తున్నారు. విజయదశమికి మూడు రోజుల ముందు నుంచే ఈ రాక ఆరంభమైంది. అప్పటి నుంచి పెరుగుతూనే ఉంది. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి భవానీ భక్తులు ఎక్కువగా వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిసా, తమిళనాడు రాష్ట్రాల్లోని తెలుగువారు భవానీ మాలలు ధరించారు. మొత్తంగా 5-6 లక్షల మంది భవానీ మాలలు ధరించారు. వారంతా దీక్షల విరమణకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం వరకు 1.50 లక్షల భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. విజయదశమి రోజున శ్రీరాజరాజేశ్వరిదేవిగా కొలువుదీరిన అమ్మవారు అదే అలంకారంలో దర్శనమిస్తున్నారు. శనివారం నుంచి అమ్మవారు మామూలు అలంకారంలోనే దర్శనమిస్తారు. మరో మూడు రోజుల పాటు ఒడిసా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భవానీలు వస్తారని అధికారులు అంచనా వేశారు. ఈసారి భవానీల తాకిడి ఐదారు రోజుల పాటు కొనసాగుతుందని భావిస్తున్నారు.

ధాన్యం సేకరణలో జాగ్రత్తలు తీసుకోండి

(5వ పేజీ తరువాయి)

జాగ్రత్తలు తీసుకుని ధాన్యం కొనాలన్నారు. వాతావరణం సహకరించని రోజుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్లను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరికోతలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనే విధానంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. వివిధ ప్రాంతాల్లో వరికోతలు సాగుతున్న విధానంపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు స్పష్టమైన వివరాలు అందజేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలును పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేసి, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

మద్దతు ధర అమలుపై నిఘా ఉంచండి

ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులకు ఇస్తున్నారా, లేదా అనే అంశంపై నిఘా ఉంచాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. మద్దతు ధర కంటే తక్కువగా ధాన్యం కొనే ద ళారులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. వరికోతలు పూర్తిచేశాక ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ట్రక్‌షీట్లను తయారుచేశాక మిల్లుల వద్దకు వెళ్లాలని రైతులకు చెప్పాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనేందుకు ఈ-క్రాప్ కీలకమని, త్వరితగతిన ఈ-క్రాప్ నమోదును పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనే సమయంలో తేమశాతాన్ని నిర్ధారించడంలో మిల్లర్లు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జేసీ నవీన్‌కు కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని మిల్లుల్లో తేమశాతం కొలిచే యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిది పరిశీలించాలన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి ఇప్పటికే 200 వాహనాలను గుర్తించారని, మిగిలిన వాహనాలను గుర్తించి రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రేషన్ మాఫియాకు అధికారుల అండ

(5వ పేజీ తరువాయి)

స్టేషన్‌కు కానీ, ఆర్డీవో కార్యాలయానికి కానీ తీసుకురాకుండా మునగచర్లలోని ఒక మిల్లుకు తరలించినట్లు తెలిసింది. పట్టుబడిన ఆటోపై ఇంతవరకు కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం. ఆటో పట్టుబడినట్లు ధ్రువీకరించే కనీస రికార్డు కూడా వారి వద్ద లేదు. ఈ పరిణామంపై ఫిర్యాదు చేసిన రాఘవాపురం ప్రజలు విస్మయం చెందుతున్నారు. అక్రమార్కులకు పీడీఎస్ అధికారుల అండ ఉందంటున్నారు. ఒక ఆటోను వారే వదిలేశారని ఆరోపిస్తున్నారు. రెండో ఆటో కూడా వదిలేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


ఆదివారం కేసు నమోదు చేస్తాం..

ఈ అంశంపై పీడీఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డిని వివరణ కోరగా, గురువారం తనకు రాఘవాపురం గ్రామస్తులు ఫోన్ చేశారని, తాను సంఘటనాస్థలికి వెళ్లేసరికి రెండు ఆటోలు కనిపించాయని, ఒక ఆటో ఆపకుండా వెళ్లిపోయినట్లు చెప్పారు. పండుగ రోజు కావడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేరన్నారు. పట్టుబడిన ఆటోపై కేసు ఎందుకు నమోదు చేయలేదని అడిగిన ప్రశ్నకు ఆయన సరైన సమాధానం చెప్పలేదు. ఆదివారం కేసు నమోదు చేస్తానని తెలిపారు.

దుర్గగుడిలో కానుకల లెక్కింపు 6, 7, 8 తేదీల్లో

ఇంద్రకీలాద్రి : దసరా మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఈనెల 6, 7, 8 తేదీలలో మహామండపం ఆరో అంతస్తులో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో వి.కె. శీనానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 7.30 గంటలకు కానుకల లెక్కింపు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

పాఠశాల హెచ్‌ఎం ఆత్మహత్య



కనుమూరు(గంపలగూడెం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కనుమూరు గ్రామానికి చెందిన రేగళ్ల రంగారెడ్డి(50) అనుముల్లంక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీగా అప్పుల పాలైయ్యాడు. తీసుకున్న అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవడంతో గురువారం పురుగుమందు తాగి కనుమూరులోని పేరంటాళ్లమ్మ ఆల యం వద్దకు మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు రేగళ్ల వివేకవర్ధన్‌రెడ్డి, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	242
చికెన్ స్కిన్‌లెస్	252

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

షిర్డీ సాయి బాబాకు లక్ష పుష్పార్చన

పమిడిముక్కల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురంలో షిర్డీసాయిబాబా మందిర 18వ వార్షికోత్సవము గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖుడు, టీడీపీ నాయకుడు, లయన్స్ క్లబ్ సభ్యుడు తాతినేని రమేశ్ దంపతులు పూజలుచేశారు. అనంతరం 1500 మందికి అన్నసమారాధన చేశారు. సాయిదత్, గంగాధర్ పలువురు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొని సేవలందించారు.



కపిలేశ్వరపురంలో షిర్డీసాయి బాబాకు లక్ష పుష్పార్చన



ఐటీ కంపెనీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఐటీ సంస్థలు రావడం శుభసూచకం

గుడివాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో ప్రారంభమైన తొలి ఐటీ కంపెనీ విజయవంతమవ్వాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక శ్రీరాంపురంలో ప్రిన్స్‌టన్ సంస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నస్థాయి పట్టణాలకు ఇలాంటి ఐటీ సంస్థలు రావడం శుభసూచకమని, స్థానికులకు ఎంతో ఉపయోగకరమన్నారు. సంస్థ సీఈవో కారంశెట్టి రవి చేస్తున్న మంచి ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పీ-4 స్ఫూర్తితో మరింత మంది ప్రవాసాంధ్రులు అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. సీఈవో రవి జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



పద్మశ్రీ స్టీల్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

పమిడిముక్కల : పామర్రు నియోజకవర్గం పారిశ్రామిక వాడగా తయారు చేసేందుకు కృషిచేస్తున్నట్టు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కపిలేశ్వరపురంలో నూతనంగా నిర్మించిన పద్మశ్రీ స్టీల్స్ కర్మాగారాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కర్మాగారం ఏర్పాటుచేయడం ద్వారా రెండు వందల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న పద్మశ్రీ స్టీల్స్ యజమాని వేణుగోపాల్ అభినందనీయులన్నారు. టీడీపీ నేతలు శ్రీవాసరావు, రాజేంద్రప్రసాద్, సుబ్రమణ్యం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పామర్రు : పామర్రు నియోజవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్ది నిరుద్యోగ యువతకు ఉపాధికల్పించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. శుక్రవారం మండల పరిధిలో భారీ వ్యయంతో నూతనంగా నిర్మితమై త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న జీఎస్ ఆర్ ఆక్వా పరిశ్రమను కూటమినేతలతో కలసి ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దాదాపు ఐదు వందల మందికి ప్రతక్ష్యంగా, పరోక్షంగా ఉద్యోగ,ఉపాధి ఈపరిశ్రమద్వారా లబించనున్నట్లు చెప్పారు. మరో కొద్దిరోజుల్లోనే ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.



గుడివాడలో..



గుడివాడ రూరల్‌లో..



కూచిపూడిలో..



పామర్రులో..



తోట్లవల్లూరులో..

రాజరాజేశ్వరీదేవిగా దుర్గమ్మ



గుడ్లవల్లేరులో..

దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం పలు దేవాలయాల్లోని అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

గుడివాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో 11 రోజులుగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ముగింపు రోజు శుక్రవారం అమ్మవారు పుష్పశయ్య అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గౌరీశంకరస్వామి వారి దేవస్థానం, వేణుగోపాలస్వామి దేవస్థానం, వేంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కె.వి గోపాలరావు, భీమేశ్వరస్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు చిన్నా, చిన్న శివాలయం ధర్మకర్తల కమిటీ చైర్మన్ నెరుసు బోసు, వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, ఆయా కమిటీల సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు గురువారం చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మండపారాధన, సహస్రనామార్చన, శమీపూజ తదితర గ్రామాలు ఘనంగా నిర్వహించారు. మోటూరు, దొండపాడు తదితర గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

కూచిపూడి: శరన్నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా 12వ రోజైన శుక్రవారం కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారు సంతోషిమాతా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు పాల్గొని లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అలంకరణ, అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు: పామర్రుల్లో విజయదశమి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కరుమారి అమ్మన్ అంకమ్మతల్లి దేవస్థానంతోపాటు, శివాలయం, శ్రీవాసవీమాత దేవాలయాల్లో అమ్మవార్లు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తిన్‌మార్ డప్పులు, మేళాతాళాలుతోపాటు, ప్రత్యేకవిద్యుద్దీపాలతో అలకరించిన వాహనంపై గ్రామంలో ఊరేగించారు. జమ్మిచెట్టు సెంటర్లో శమీవృక్షానికి ఆలయ ప్రధానఅర్చకులు తోలేటి సోమేశ్వరశర్మతోపాటు లంకా భీష్మకుమార్ ఆలయ అధికారి జెవెంకటేశ్వరరావు పర్యవేక్షణలో బేతనబోట్ల ఫణీంద్ర, పవన్‌శర్మలు పూజలు నిర్వహించారు. దీంతో జమ్మిచెట్టు సెంటరు భక్తులతో పోటెత్తింది.

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో విజయదశమి ఉత్సవాలు, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. గురువారం దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సహస్రనామార్చన, సకల విజయాలు ప్రాప్తి కోసం శ్రీలలితా,రుద్ర మూలమంత్ర హననం నిర్వహించారు.అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం సాయంకాలర్చన, అమ్మవారికి ఊంజల సేవ, పంచహారతులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజయదశమి పర్వదినం సందర్భంగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, గుడివాడ డివిజనల్ రెవిన్యూ అధికారి జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపత సమేతంగా అమ్మవారిని దర్శించుకొన్నారు. కాగా వారినిఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు(మోహన్) లు సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ధర్మకర్తలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ట్రాక్టర్‌పై అంగరంగ వైభవంగా గ్రామోత్సవం న్వహించారు. రజకపేట రామాలయం నుంచి భారీ ఊరేగింపు, తీన్మార్ బ్యాండ్‌తో ఊరేగింపు ప్రారంభమై పొద్దుపోయో వరకు సాగింది. స్థానిక శివాలయంలోను దసరా ఉత్సవాలు ముగిశాయి.



పమిడిముక్కలలో..

పమిడిముక్కల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో జీవించాలని విజయానికి ప్రతీక అయిన విజయదశమి అందరికి భోగ భాగ్యాలు కలుగ జేయాలని అమ్మవారిని కోరుకున్నట్టు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసుపార్థసారథి అన్నారు. పమిడి ముక్కల మండలం మేడూరు కోదండరామాలయంలో కొనసాగుతున్న దసరా ఉతవాల సందర్భంగా గురువారం విజయద మి పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో కలసి పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే కుమార్ రాజాకు గ్రామప్రముఖులు లోయ శివశంకర్, లోయ ప్రసాద్, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూటమి నాయకులతో కలసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పాడిపంటలతో గ్రామ ప్రజలు సుఖశాంతులు భోగ ,భాగ్యాలతో జీవిచాలని అమ్మవారిని వేడుకున్నట్టు కుమార్ రాజా అన్నారు.

మాజీ ఎంఈవో గుత్తా రమేష్ మృతి



గుత్తా రమేష్

గుడివాడ : విశ్రాంత మండల విద్యాశాఖాధికారి, మానవతా స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకుడు గుత్తా రమేష్(76) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని ఆయన స్వగృహంలోని రమేష్ భౌతికకాయానికి , పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఎంఈవో రమేష్ కుటుంబసభ్యుల సహకారంతో విజయవాడ, ఎల్.వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వైద్యులు నేత్రాలను సేకరించారు.

ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

గుడివాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి 121వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గాంధీ మండపంలోని గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్‌యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్ పాల్గొన్నారు.

గాంధీ మండపంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహిం చారు. రాంప్రసాద్, గోపిక, రాంబాబు, రీటా, చరణ్ పాల్గొన్నారు.

పామర్రు :మహాత్మగాంధీ అనుసరించిన శాంతి, అహింస మార్గాలు నేటితరానికి ఎంతో ఆదర్శనీయమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. పామర్రులోని టీడీపీ కార్యాలయంలో గాంధీజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే జనసేన ఇన్‌చార్జితాడిశెట్టి నరేష్, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్‌లు పూలమాలలేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి, ఉపసర్పంచ్ కార్యదర్శి అబ్దుల్ సలీమ్ పంచాయతీ సభ్యులతో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎలకుర్రు పీఏసీఎస్ అధ్యక్షుడునాగేశ్వరరావు గాంధీజీ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

పమిడిముక్కల : జాతిపిత మహాత్మాగాంధీ, మాజీప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో సీతారామరాజు, సూపరింటెండెంట్ రామకృష్ణ, మహేశ్ పాల్గొన్నారు.

పామర్రు: భారతదేశ మాజీప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి 125 వ జయంతి వేడుకలను స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నాయిబ్రహ్మణుల సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దాలిపరి ప్రసాద్‌రావు, అయోధ్య హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తోట్లవల్లూరు :తోట్లవల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి అలయం వద్ద గురువారం ఆర్యవైశ్య సంఘం నాయకులు గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీజీ, అమర జీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమామహేశ్వరరావు, తాడికొండ ఉదయ సూర్య సుధాకర్, వెంకట సుబ్బారావు, శేషశ్రీనివాసరావు పాల్గొన్నారు.



పామర్రులో..

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు వల్ల ఎన్నో ప్రయోజనాలు ప్రజలకు చేకూరుతాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. గుడివాడ నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మనోహరరావు, డీఎల్‌డీవో సునీత శర్మ, పాల్గొన్నారు.

గుడివాడ: జీఎస్టీ తగ్గింపు ద్వారా ఎంతో ప్రయోజనం కలుగుతుందని పశుసంవర్థక శాఖ జేడీ నరసింహం అన్నారు. శుక్రవారం గుడివాడ మార్కెట్ యార్డులో గుడివాడ డివిజన్‌లోని డాక్టర్లు, సిబ్బందితో జీఎస్టీ తగ్గింపు గురించి అవగాహన కల్పిస్తూ బ్యానర్‌ను ఆవిష్కరించారు. తమ డాక్టర్లు వైద్యశాలలో ఉండి రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మోటూరు, రుద్రపాక, బొమ్ములూరు, అంగలూరు పశువైద్యాధికారులు ఉన్నం హనుమంతరావు, జి.రామకృష్ణ, ఎం.వేణు, చింతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : రైతులకు వ్యవసాయ పరికాల కొనుగోళ్లపై 28 శాతంగా ఉన్న జీఎస్టీ 18 శాతానికి కేంద్రప్రభుత్వం తగ్గించిదని గుడివాడ డిప్యూటీ కమిషనర్ సునీత అన్నారు. శుక్రవారం జీఎస్టీ 2.0 ప్రచార కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరులో అవగాహనా ర్యాలీ, పంచాయతీ కార్యలయం వద్ద సదస్సు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడ్లవల్లేరులో జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ



వరద తగ్గటంతో రంగుమారిన పసుపుతోట

దెబ్బతిన్న పసుపు, మినుము

తోట్లవల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులోని కృష్ణానదీపాయల్లో శుక్రవారం వరద భారీగా తగ్గింది. కరకట్ట వరకు ఉన్న వరద తగ్గింది. అయితే పసుపు, మినుము, కూరగాయ తోటలు భారీగా చనిపోయాయి. కరకట్ట వెంట రైతుల పంటలు వరద నీటికి నల్లగా మాడిపోయాయి. దీంతో తమకు భారీగా నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్యుమరేషన్ జరిపి పంటల నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఓటు హక్కును కాపాడడమే లక్ష్యం

పామర్రు: ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి వజ్రాయుధంగా ఉన్న ఓటు హక్కును కాపాడడమే కాంగ్రెస్ లక్ష్యమని పామర్రు నియోజకర్గ సమన్వకర్త మోవ్వా మోహనరావు పేర్కొన్నారు. పామర్రులో శుక్రవారం ఆపార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఐసీసీ సభ్యులుమురళిమోహన్, పామర్రుబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డీకాసులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

గుడివాడ : గాంధీ జయంతి రోజున పలుచోట్ల అక్రమ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక పెద ఎరుకపాడులో వేల్పుల కిరణ్ వద్ద 6 మద్యం బాటిళ్ల, నిమ్మకూరుకు చెందిన కొండపల్లి నాగకుమారి వద్ద 7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నామమాత్రంగా గ్రామసభ

గుడ్లవల్లేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో శుక్రవారం పంచాయితీ ఆవరణలో స్టాట్యూటరీ గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ వారు మైక్‌ద్వారా రన్నింగ్ రిక్షాపై ప్రచారం చేయించారు. ఆ ప్రచారం ఏమిటని ప్రజలు వినేలోగానే ఆరిక్షా వెళ్ళిపోతుంది. గ్రామంలోని కొత్తకాలనీలో స్థలాలు మెరక చేసేందుకు వేముగుంట చెరువు ఎండకట్టి తవ్వకం చేయాలని, అగ్రహారం చెరువు గట్టులు కరిగిపోయి చుట్టూఉన్న సీసీ రహదారులు కోసుకుపోతున్న నేపథ్యంలో చెరువు తవ్వి గట్టులు వేయడం, అంబే ద్కర్ నగర్‌లోని పంచాయతీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ గట్టు తెగిపోవడంతో గ్రామ చెరువు పాటలు నిలిచిపోయినందున గట్టు ఏర్పాటు వంటి విషయాలపై తీర్మానాలు చేశారు. ఎంచాయతీ కార్యదర్శి నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, వెంకట్రావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్‌మృతి

దమ్మపేట : ప్రమాదవశాత్తు మూడు అంతస్తుల భవనంపై నుంచి వ్యక్తి కిందపడి మృతి చెందాడు. దమ్మపేటకు చెందిన రాయనపాటి కల్యాణశేఖర్ (42), ప్రైవేట ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం తాను అద్దెకు నివాసం ఉంటున్న మూడంతస్తుల భవనం పైకి ఎక్కాడు ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఖమ్మంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య , ఇద్దరు కుమారులు ఉన్నారు.

స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం 6న

కూచిపూడి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 17 విభాగాల్లో స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రకటించగా, కూచిపూడి రైతు బజార్‌కు రాష్ట్రస్థాయి స్వచ్ఛ రైతు బజారు అవార్డుల జాబితాలో చోటు దక్కింది. 2017వ సంవత్సరంలో 23 సెంట్ల స్థలంలో మోడల్ రైతు బజార్‌గా దీనిని తీర్చిదిద్దారు. రైతు బజార్ లోపల సీసీ కెమెరాలు, టాయిలెట్లు, డ్రింకింగ్ ఆర్వోప్లాంట్ వంటి వసతులు సైతం ఉండటంతో ఇటు వ్యాపారస్థులకు, అటు వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తటం లేదు.



గుడివాడ మున్సిపల్ కార్యాలయం

గుడ్లవల్లేరు :స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ అవార్డుల్లో పాఠశాల విభాగంగలో గుడ్లవల్లేరు మండలం అంగలూరు బాలికోన్నత పాఠశాలకు స్వచ్ఛఅవార్డు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పాఠశాల విద్యార్థులు స్వచ్ఛత క్లబ్‌గా ఏర్పడి పాఠశాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రధానోపాధ్యాయుడు జగన్మోహనరావు చూసుకుంటున్నారు. విద్య, స్వచ్ఛత,క్రమశిక్షణ అన్ని రంగాల్లో మంచి స్థానాలు సాధిస్తున్న ఈ పాఠశాల పలు పాఠశాలలకు ఆదర్శపాయమని పలువురు అభినందిస్తున్నారు.

పమిడిముక్కల : తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలో స్వచ్ఛ హైస్కూల్ అవార్డు లభించింది. పరీక్షా ఫలితాలు, క్రీడలు, పరిసరాల పరిశుభ్రతలో మేటి హైస్కూల్‌గా పేరొందని తాడంకి స్కూల్‌కు స్వచ్ఛ అవార్డు లభించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తంచేశారు.



కూచిపూడి రైతు బజార్

గుడివాడ : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 17 విభాగాల్లో స్వచ్ఛఅవార్డులను ప్రకటించింది. జిల్లా స్థాయిలో స్వచ్ఛ కార్యాలయంగా గుడివాడ మున్సిపల్ కార్యాలయం, స్వచ్ఛ అంగన్వాడీగా సత్యనారాయణపురం స్లేటర్‌పేట-1 కేంద్రం ఎంపికయ్యాయి. ఈ నెల 6వ తేదీన జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జరుగు అవార్డు ప్రధానోత్సవంలో అవార్డులను అందించనున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలి : కలెక్టర్

మచిలీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ బ్యాంకు అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాల మంజూరు పురోగతి, అంశాలపై ఆయన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీంద్రారెడ్డి, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డిఓ నవీన్‌కుమార్, ఇండియన్ బ్యాంకు ఏజీఎం రామమూర్తి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావ్, జె.జ్యోతి, నాగరాజా వివిధ బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాగిత, బుల్లయ్య

కబడ్డీ పోటీల విజేతలకు అభినందన

పెడన రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : యువతలో ఉత్సాహన్ని ఆరోగ్యాన్ని ధృడత్వాన్ని పెంపొందించేవి ఆటలేనని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. లంకల కలవగుంటలో విజయవాడ నెహ్రూ యువజన సేవా కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. దివంగత ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీల విజేతలకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జగన్నాధరావు (బుల్లయ్య)లు ముఖ్య అతిధులుగా విచ్చేసి బహుమతులు అందించారు.



మెహర్‌బాబాను అభినందిస్తున్న నరసింహారావు

తాడేపల్లి మెహర్‌బాబాకు పలువురి అభినందన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 03 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని బందరు డివిజన్ రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడు తాడేపల్లి మెహర్‌బాబా అన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశపు మందిరంలో జరిగిన ఎన్నికల్లో డివిజన్ రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడేపల్లి మెహర్‌బాబా, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా అన్నం హరిరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా గజ్జల భానుప్రకాష్, ఎ.వి.వి.సుబ్బారావు, కార్యదర్శిగా ఊసా ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా చలవాది వెంకటేశ్వరరావు, పి.అన్వేష్, కోశాధికారిగా పరశు ప్రసాద్‌తో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు, ముగ్గురు సలహామండలి సభ్యులు ఎన్నికయ్యారు. తాడేపల్లి మెహర్‌బాబును గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు సత్కరించారు.



మోపిదేవిలో..



కోడూరులో ..



మచిలీపట్నంలో..



గూడూరులో..



పెడనలో..

రాజరాజేశ్వరీదేవికి భక్తనీరాజనం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో గురువారం అర్ధరాత్రి శక్తిపటాల ముగింపు ఊరేగింపు అత్యంత వైభవోపేతంగా జరిగింది. దసరా శరన్నవరాత్రులలో భాగంగా శక్తి పటాల ఊరేగింపు మచిలీపట్నంలో ప్రతి ఏడాది ఆనవాయితీగా జరుగుతోంది. ఈ కార్యక్రమం గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జరిగింది. నగరంలో ఈ ఏడాది దాదాపు 64 శక్తిపటాలు గడపగడపకు తిరిగాయి. వందలాది మంది ప్రజలు కోనేరుసెంటర్‌కు చేరుకుని శక్తి పటాల ప్రదర్శనను తిలకించారు. ఈ భారీ ప్రదర్శనతో శక్తిపటాల ఊరేగింపు ముగిసింది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగాయలంక: గణపేశ్వరం శ్రీదుర్గాగణపేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రీవాసవీ కనక్యకా పరమేశ్వరీ, పార్వతీ అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాగాయలంక కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మోపిదేవి: శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మహోత్సవాలలో భాగంగా మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పెదకళ్లేపల్లి శ్రీదుర్గానాగేశ్వర స్వామి ఆలయాలతోపాటు ఆయా గ్రామాల్లో అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

చల్లపల్లి : శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. 11 రోజులపాటు అమ్మవారిని వివిధ అవతారాలలో అలంకరించి విశేష పూజలు చేశారు. విజయదశమి రోజున దేవాలయాల్లో శమీపూజ నిర్వహించారు. చల్లపల్లిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఊరేగింపు ఉత్సవం సంబరంలా సాగింది. రాజమండ్రికి చెందిన నిడదవోలు ఆనందరావు గ్రూపు కళాకారులు వేషధారణలతో, నృత్యవిన్యాసాలతో ఆకట్టుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నసమారాధన జరిగింది. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, ఉడత్తు బాబు, జూపూడి సాయి, వరదా హరిగోపాల్, కొల్లిపర నరేంద్ర, తమ్మన సతీష్, వరదా రాజశేఖర్, రాంప్రసాద్, జల్లూరు ప్రసాద్, చుండూరు ప్రభాకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కోడూరు: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆఖరి రోజు గురువారం కోడూరులోని శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో ఉన్న రామరాజు చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన పడవపై అమ్మవారిని ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు.

పెడన : శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల చివరి రోజైన గురువారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఉత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డా. కొల్లూరి చిన్నా ఆధ్వర్యంలో 108 మంది మహిళలు తమ పతులతో కలసి కన్యకా పరమేశ్వరీ దేవిని పసుపు కుంకుమలు కలిపిన పవిత్ర జలంతో అభిషేకించారు. కొల్లూరి రాధాకృష్ణగుప్తా, దేసు శ్రీనివాస్, మామిడి ప్రసాద్, సమయమంతుల ముత్యాలరావు, కొల్లూరి శ్రీనివాసరాజ్ కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

గూడూరు : విజయదశమి సందర్భంగా గూడూరు మండలంలో దేవాలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాయవరం, పాత కాలనీలో భజన కార్యక్రమం నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెడన రూరల్ : దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మడకలోని గంగా పార్వతి సమేత భోగలింగేశ్వర స్వామి, చెన్నూరులో గంగా పార్వతి సమేత నారద లింగేశ్వరస్వామి, చోడవరంలో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి, శివాలయాలలో విజయదశమి పూజలు చేసి జమ్మిసేవ చేశారు. అన్నసమారాధన చేశారు.

మచిలీపట్నం క్రైమ్ : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సతీసమేతంగా పాల్గొన్నారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలతో పాటు మోటారు ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోని పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బందరుకోటలో మంత్రి రవీంద్ర పూజలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : బందరుకోట శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర సతీ సమేతంగా చండీయాగంలో పాల్గొన్నారు. శ్రీలలితాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది భక్తులు విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. చండీయాగం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, ఏఎంసీ చైర్మన్ కుంచే నాని, దిలీప్‌కుమార్, మోటమర్రిబాబాప్రసాద్, లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనిల్‌కుమార్, తోట రాము, భానుమూర్తి, మచిలీపట్నం న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణం

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులిగడ్డ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి శాంతికల్యాణం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. నలుగురు జంటలు స్వామివారి కళ్యాణం వైభవోపేతంగా నిర్వహించారు.

తగ్గిన ధరలు తప్పనిసరిగా అమలు చేయాలి

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

నాగాయలంక, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ అనుగుణంగా తగ్గిన ధరల పట్టికలు దుకాణాల ముందు ఖచ్చితంగా ఉంచాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం నాగాయలంక పురవీధుల్లో అవగాహన ర్యాలీ, సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై మార్కెట్ యార్డు ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. **మచిలీపట్నం టౌన్:** గాంధీజయంతి సందర్భంగా నగరంలోని రహదారులు భవనాల అతిథిగృహం సమీపంలోని గాంధీ విగ్రహానికి మంత్రి రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఇతర నాయకులతో కలసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారి సాయిబాబు, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్వరూపరాణి ప్రసంగించారు. మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు. తొలుత మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **మచిలీపట్నం టౌన్ :** జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నం హోటల్స్ అసోసియేషన్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహిం చారు. **ఘంటసాల :** పేదలకు కూటమి ప్రభుత్వం మేలు చేసేందుకు జీఎస్టీని తగ్గించిందని టీడీపీ నేతలు, గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కల్యాణ్ అన్నారు. తెలుగురావుపాలెంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అహింసావాదం నేటి సమాజానికి ఆదర్శం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 03 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమం మచిలీపట్నం లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి లక్ష్మీ, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ గాంధీజీ త్యాగనిరతని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్‌బాబు, అధ్యాపకులు విజయశ్రీ, సాజిదా, సురేష్, సుందరలక్ష్మి పాల్గొన్నారు.

● బందరు మండలం కానూరు సచివాలయంలో గాంధీ జయంతి వేడుకలు కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ శ్రీహరి, పీత రాము, బొమ్మిడి ఏడుకొండలు, బొలిశెట్టి నాని, మోపిదేవి కృష్ణ, కొక్కిలిగడ్డ ప్రభుదాసు, రాజేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో గురువారం గాంధీ చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజుతో పాటు న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సన్‌స్టార్ స్కూల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి కిషోర్‌తో పాటు ఆదిత్య, వెంకటేశ్వరరావు, అశోక్‌బాబు, తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కానూరులో జరిగిన గాంధీజయంతి కార్యక్రమంలో పాల్గొన్న తెలుగురైతు అధ్యక్షుడు సత్యనారాయణ

దివిసీమకు కృష్ణారావు పునరుజ్జీవం కల్పించారు

● పీఏసీఎస్ చైర్మన్ మర్రె గంగయ్య

అవనిగడ్డ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : 1977లో సంభవించిన ఉప్పెనకు శవాల దిబ్బగా మారిన దివిసీమకు మండలి వెంకట కృష్ణారావు పునరుజ్జీవం కల్పించారని జనసేన మండల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మర్రె గంగయ్య అన్నారు. శుక్రవారం అవనిగడ్డలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వంతెన సెంటర్‌లోని కృష్ణారావు విగ్రహానికి కోడూరు మండలం పిట్టల్లంక గ్రామ కూటమి నాయకుల తరఫున గంగయ్య, సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్లు మాదివాడ రత్నారావు, యలవర్తి రాజనాగమునేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, టీడీపీ టౌన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, టీసీ అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ పాల్గొన్నారు.

మైక్రో ఫిల్టర్ బెడ్ల నిర్మాణానికి భూమిపూజ

నాగాయలంక : మండలంలోని వక్కపట్లవారిపాలెంలో రూ. 14.80 లక్షలతో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ ఫండ్స్‌తో నిర్మించనున్న మైక్రో ఫిల్టర్ బెడ్‌లకు భూమి పూజను శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నిర్వహించారు. సర్పంచ్ అంబటి శ్యాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మాజీ శాసనసభ్యులు అంబటి శ్రీహరిప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, అంబటి గిరిప్రసాద్, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రావి బాబూరావు మృతి

మోపిదేవి : మోపిదేవి మాజీ సర్పంచ్ రావి బాబూరావు (99)మృతి చెందారు. విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఆయనకు పలువురు ప్రముఖులు విజయవాడ, మోపిదేవిలలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, దేవినేని మల్లికార్జున రాములు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేయూత

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేయూత నిస్తుందని ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ అన్నారు. మచిలీపట్నం ఆప్టికల్స్ యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో హసీంబేగ్ మాట్లాడుతూ, ఏపీ మైనారిటీస్ రాష్ట్ర కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన ఎనిమిది ముస్లిం మైనారిటీ ప్రధాన కులాలకు సంక్షేమ పథకాలు అందించనున్నట్టు తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో మైనార్టీల కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగి సహాయ కార్యక్రమాలు అందించడం జరుగుతుందన్నారు. మచిలీపట్నంలో ఆప్టికల్స్ యజమానుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మహమ్మద్ నియాజ్‌ను బేగ్ అభినం దించారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ అజీమ్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, వివిధ ఆప్టికల్ షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.



హసీంబేగ్‌ను సత్కరిస్తున్న మహమ్మద్ నియాజ్

ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈనెల 4న ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం పై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించి సజావుగా ఏర్పాట్లు చేయాలని దిశా నిర్దేశం చేశారు. శనివారం ఉదయం 11 గంటలకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమానికి అనుగుణంగా ప్రతి అసెంబ్లీ నియోజక వర్గ ప్రధాన కేంద్రాలలో సంబంధిత శాసనసభ్యులతో సమన్వయం చేసుకుని నిర్వహించాలన్నారు. టెలీకాన్ఫరెన్సులో ఆర్డీవో శ్రీనివాస్, డిఆర్డీఏ పిడి హరిహరనాథ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, డిఎల్‌డీవోలు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అపూర్వం

మోపిదేవి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనకు దాతలు అందిస్తున్న ఆర్థిక సహకారం అపూర్వమని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. గురువారం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో దాతల ఆర్థిక సహకారంతో రూ.25 లక్షలు అంచనాతో జిల్లా పరిషత్ హైస్కూలుకు అదనపు తరగతి గదుల భవన సముదాయ నిర్మాణ పనులు చేపట్టారు. ముఖ్యఅతిథిగా మండలి వెంకట్రామ్ విచ్చేసి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, సభ్యురాలు దిడ్ల రాణి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, రాధిక, యర్రంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముడా భూముల్లో బుసకతవ్వకాలు నిలిచేనా

మచిలీపట్నం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నార్త్‌మండలంలో బుసక, ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని శుక్రవారం రాత్రి రెవెన్యూ అధికారులు సముద్రతీరం వెంబడి గ్రామాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. కరగ్రహారంలో శుక్రవారం గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసుకుని ముడా, బే ఆఫ్‌బెంగాల్ భూములనుంచి బుసకతవ్వకాలు నిలిపివేయాలని తీర్మానం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి కొల్లు రవీంద్రకు తెలియజేశారు. దీంతో స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, డీఎస్పీ సీహెచ్ రాజా, మైనింగ్ శాఖ అధికారులతో మాట్లాడారు. గ్రామస్తులతోపాటు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటుచేసి నిఘా ఉంచాలని ఆదేశించారు. మంత్రి సూచనలతో రెవెన్యూ అధికారులు కరగ్రహారం, గోపువానిపాలెం, మంగినపూడి తదితర గ్రామాల్లో ముడా, ప్రభుత్వ భూములలో బుసకతవ్వకాలు నిలిపివేయాలని సూచిస్తూ బోర్డులు ఏర్పాటుచేశారు.



రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు

జిల్లాస్థాయి స్వచ్ఛ వారియర్స్ అవార్డులు



శివపార్వతి



నాగేంద్రరావు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని ఇద్దరు పారిశుధ్య కార్మికులకు జిల్లాస్థాయిలో స్వచ్ఛ వారియర్స్ అవార్డులు దక్కాయి. 44, 16వ డివిజన్లలో పారిశుద్యం మెరుగ్గా ఉండేందుకు కృషి చేసిన ఇద్దరు కార్మికులకు ఈ అవార్డులు దక్కాయని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు శుక్రవారం మీడియాకు తెలిపారు. పారిశుధ్య కార్మికురాలు నక్కా శివపార్వతి, కార్మికుడు కఠారి నాగేంద్రరావు అవార్డుకు ఎంపికయ్యారు.

నిర్మలకుమారి మిద్దెతోటకు అవార్డు

మచిలీపట్నం వెన్నెల మహిళా సమాఖ్యలో సభ్యురాలు పరసా నిర్మలకుమారి తన ఇంటిపై మిద్దె తోట పెంచుతున్నందుకు జిల్లాస్థాయి అవార్డు దక్కినట్టు మెప్మా పీడీ సాయిబాబు తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి తన ఇంటిపై నిర్మల కుమారి 26 రకాల మొక్కలు పెంచుతున్నారు.



రుస్తుంబాదలో ఓ ఇంటిపై టెర్రస్ గార్డెన్ పెంచుతున్న పరసా నిర్మల కుమారి